ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
గురువారం 8 మే 2025

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రాధాన్యం

● 150 మందికి రూ.50 లక్షల విలువైన కృత్రిమ కాళ్లు పంపిణీ

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాళ్లు అందజేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మే 7 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని, ఇందులో భాగంగా వారి అభివృద్ధికి అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్ ఆవరణంలో విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో చెన్నై యాక్సెస్ హెల్త్ కేర్ ఫ్రీడం ట్రస్ట్ వారి సహకారంతో 150 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.50 లక్షల విలువైన కృత్రిమ కాళ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న కలెక్టర్, జేసీ ఆదర్శరాజేంద్రన్‌లు విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాళ్లను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ తోడ్పాటును అందిపుచ్చుకుని విభిన్న ప్రతిభావంతులు అభివృద్ధి చెందాలన్నారు. జిల్లాలోని 150 మంది కాళ్లు కోల్పోయిన విభిన్న ప్రతిభావంతులకు సంబంధించి ఈ ఏడాది మార్చి మొదటి వారంలో కృత్రిమ కాళ్లకు కొలతలు తీసుకున్నారని, అతి తక్కువ కాలంలోనే వీరందరికీ చెన్నైకి చెందిన యాక్సిస్ హెల్త్ కేర్ ఫ్రీడం ట్రస్ట్ ఆర్థిక సహకారంతో నేడు రూ.50 లక్షల విలువైన ఆధునిక కృత్రిమ కాళ్లు అమర్చడం జరిగిందన్నారు. మన జిల్లా వారు ఇంత మంది లబ్ధి పొందడం ఎంతో సంతోషకరమని, వీరి జీవితాల్లో మార్పు తీసుకురావడం గొప్ప విషయమన్నారు. ఇందుకు కృషి చేసిన విభిన్న ప్రతిభావంతుల శాఖ, చెన్నై యాక్సెస్ హెల్త్ కేర్ ఫ్రీడం ట్రస్టు ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధులు, సంక్షేమశాఖ సహాయ సంచాలకులు ఆర్‌వీ క్రిష్ణకిశోర్, వారి సిబ్బంది, చెన్నై యాక్సెస్ హెల్త్ కేర్ ఫ్రీడం ట్రస్టు ప్రతినిధులు, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

నేడు అధికార లాంఛనాలతో పాలకొండ్రాయుడు అంత్యక్రియలు

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మే 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజంపేట మాజీ ఎంపీ, రాయచోటి మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడు అంత్యక్రియలను అధికార లాంఛనాలతో గురువారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు మంగళవారం ఉదయం మరణించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆయన అంత్యక్రియలను అధికార లాంఛనాలతో గురువారం ఉదయం నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లు కోసం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఇతర అధికారులకు వివిధ సూచనలు చేసినట్లు తెలిపారు.

నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన మహనీయుడు అల్లూరి

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన మహనీయుడు, గెరిల్లా యుద్ధతంత్ర కళతో బ్రిటిష్ సైన్యానికి ముచ్చెమటలు పట్టించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు కొనియాడారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఎస్పీ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మన్యం ప్రజల దీన స్థితిగతులను పరిశీలించి బ్రిటిష్ అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా విప్లవానికి సిద్ధం కావాలని మన్యం ప్రజలను పురిగొల్పారన్నారు. 1924 మే 7న శాశ్వత నిద్రలోకి ఆయన వెళ్లిపోయారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శంకరమల్లయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు రాజారమేశ్, రాజారెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవరెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పెద్దయ్య, ఇతర పోలీసు అధికారులు, డీపీవో సిబ్బంది, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో.. రింగుమంటోంది

కడప సెంట్రల్ జైలు వివాదాలకు కేరాఫ్‌గా మారింది. అక్కడ ఖైదీలు, రిమాండ్ ఖైదీలు సెల్‌ఫోన్లను విచ్చలవిడిగా వాడుతున్నారు. అది కూడా ఒక్కరి దగ్గరే తొమ్మిదిసార్లు సెల్‌ఫోన్లు దొరకడం విశేషం. తనిఖీల్లో ముద్దాయి నుంచి సెల్‌ఫోను స్వాధీనం చేసుకోగా.. మీరు తీసుకెళితే తీసుకోండి, మరలా తెచ్చుకుంటా అని అతను సవాలు చేసే స్థాయికి వచ్చిందంటే సెంట్రల్ జైలులో నిఘా డొల్లతనం బయటపడుతోంది. ఎర్రచందనం కేసులో పీడీ యాక్టు నమోదై సెంట్రల్ జైలులో ఉన్న వ్యక్తి వద్ద ఆదివారం సెల్‌ఫోను దొరికింది. దీంతో అందుకు బాధ్యులైన డిప్యూటీ జైలరు, వార్డెన్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. అయితే ఆ విషయం మాత్రం బయటికి తెలియకుండా గుట్టుగా ఉంచడం గమనార్హం. ఇదొకటే అనుకుంటే పొరపాటే.. అక్కడ రాజా ప్యాకెట్లు, బీడీలు, సిగరెట్లు విచ్చలవిడిగా దొరుకుతున్నట్లు ప్రచారం ఉంది.





● విచ్చలవిడిగా సెల్‌ఫోన్ల వినియోగం

● ఒక్క ఖైదీ వద్దనే తొమ్మిదిసార్లు సెల్‌ఫోన్లు పట్టుబడిన వైనం

● డిప్యూటీ జైలరు, వార్డెన్‌పై సస్పెన్షన్ వేటు

(కడప-ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లో హత్య కేసులు, ఇతరత్రా కేసుల్లో శిక్ష పడ్డ వారందరినీ సెంట్రల్ జైలుకు తీసుకువస్తారు. ప్రస్తుతం శిక్ష పడ్డ ఖైదీలు, రిమాండు ఖైదీలు, పీటీ వారంటు కలిగిన వారు కలిసి 630 మందికి పైగా ఉన్నారు. కరుడుగట్టిన నేరస్తులను 'కావేరి' బ్యారక్‌లో ఉంచుతారు. జైల్లో తప్పు చేసిన ఖైదీలనూ కావేరి బ్యారక్‌లో వేస్తారు. ప్రత్యేక అనుమతులు తీసుకున్న వారు 'తుంగభద్ర'లో ఉంటారు. 'స్నేహసరోవర్'లో మంచి నడవడిక కలిగిన వారు, బయట పెట్రోలుబంకు, క్లీనింగ్, డెయిరీఫాంలో పనిచేసే వారు ఉంటారు.

సెల్‌ఫోన్ల వినియోగం

సెంట్రల్ జైలులో సెల్‌ఫోన్లు విచ్చలవిడిగా వినియోగించం పెద్ద దుమారం రేపుతోంది. చాపాడు మండలం కదిరేపల్లెకు చెందిన జాకీర్ పీడీ యాక్టుతో ఏడాదిగా తుంగభద్ర బ్యారక్‌లో ఉంటున్నారు. అతని వద్ద ఇప్పటి వరకు 8 ఫోన్లు దొరికినట్లు సమాచారం. నాలుగురోజుల క్రితం జైళ్ల భద్రతపై విజయవాడలో కొత్త డీజీ అధ్యక్షతన సమావేశం జరిపారు. జైళ్లలో ఖైదీలకు అదనపు వసతులతో పాటు ఇల్లీగల్ యాక్ట్ ఉంటే సూపరింటెండెంట్‌లే అందుకు బాధ్యులని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఆదివారం జైల్లో తనిఖీ చేయగా జాకీర్ ఉండే బ్యారక్‌లో ఓ టచ్ ఫోను దొరికింది. అందుకు బాధ్యులుగా డిప్యూటీ జైలరు, వార్డెన్‌ను సస్పెండ్ చేశారు. జాకీర్ వద్ద సెల్‌ఫోను దొరకడం ఇది తొమ్మిదోసారి. అలాగే 20రోజుల క్రితం ఒక హత్య కేసులో జైల్లో ఉన్న వ్యక్తి వద్ద కూడా సెల్‌ఫోను దొరికినట్లు సమాచారం. ఈ విషయాన్ని బయటకు పొక్కనివ్వలేదు.

ఇద్దరి సస్పెన్షన్

పీడీ యాక్ట్ నమోదైన జాకీర్ వద్ద దొరికిన సెల్‌ఫోను, సిమ్‌కార్డును జైలు సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రావు రిమ్స్ పోలీసులకు సరెండరు చేశారు. ఇందులోని కాల్ డేటా బయటికి వస్తే ఎవరెవరు జైలు నుంచి మాట్లాడారు, ఎర్రచందనం స్మగ్లర్లు, పొలిటికల్ లీడర్స్ ఎంతమంది మాట్లాడారో వెలుగులోకి వస్తుంది. ఈ విషయమై జైలు సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. బ్యారక్ సమీపంలో పాత సెల్ దొరికిందని, దీనిపై రిమ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశామని అన్నారు. సిగరెట్లు, రాజాల వినియోగం అవాస్తవమన్నారు. పటిష్ఠమైన నిఘా ఉంచామని, ప్రతి ఒక్కరినీ తనిఖీ చేస్తున్నామన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన డిప్యూటీ జైలర్ హరినాథ్, వార్డెన్ సుబ్బరాయుడును సస్పెండ్ చేశామన్నారు.

'రాజ' ప్యాకెట్ రూ.500

డబ్బులు పెట్టే స్థోమత ఉంటే చాలు.. సెంట్రల్ జైలులో రాజ ప్యాకెట్లు, బీడీలు, సిగరెట్లు విచ్చలవిడిగా దొరుకుతాయన్న ప్రచారం ఉంది. రాజ ప్యాకెట్ రూ.500 నుంచి రూ.700, ఒక సిగరెట్ రూ.100, కట్ట బీడీలు రూ.500లకు అమ్ముతున్నట్లు సమాచారం. జైల్లో తుంగభద్ర, స్నేహసరోవర్, కావేరి బ్యారక్‌లు ఒకేచోట ఉన్నాయి. ఖైదీలు ఈ బ్యారక్‌ల నుంచి బయటికి వచ్చినప్పుడు అందరూ కలిసే ఉంటారు. వీరందరికీ రాజ ప్యాకెట్ రూ.500కు అమ్ముతున్నారని అంటున్నారు. శిక్షపడ్డ ఖైదీలు గంగ, యమున, సరస్వతి బ్యారక్‌లలో ఉంటారు. వారు లోపలే ఉంటారు. అక్కడ రాజ ప్యాకెట్ రూ.700కు అమ్ముతున్నట్లు సమాచారం. ఇటీవల తనిఖీల్లో ఓ హెడ్ వార్డెన్ 'నీక్యాప్'లో 18 రాజ ప్యాకెట్లు బయటపడినట్లు సమాచారం. అతడిని మందలించి వదిలేయడంతో మిగతా సిబ్బంది కూడా ఇదేబాట పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. జైలు ఆవరణలో బేకరీ ఉంది. ఇందులో బిస్కెట్లు, కేకులు, ఇతర తినుబండారాలు తయారుచేస్తారు. వీటికి అవసరమైన నూనె, చక్కెర డాల్డా ఇతరత్రా బయట నుంచి ఆటోల ద్వారా లోపలికి తీసుకు పోతారు. వీటిద్వారా రాజ, సిగరెట్స్, బీడీలు వస్తున్నట్లు సమాచారం.



నేను విజిలెన్స్ డీఎస్పీని.. సస్పెండ్ చేస్తా జాగ్రత్త..!

● ట్రాన్స్‌కో అధికారులకు అజ్ఞాత వ్యక్తి ఫోన్

● ఫోన్‌లో బెదిరింపు...రూ.లక్ష ట్రాన్స్‌ఫర్

● విజిలెన్స్, ఏసీబీ, సీఐడీ పేరుతో మోసాలు



పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ క్రైం నేరగాళ్లు కూడా పెరిగిపోతున్నారు. ఇందుకు ఫోన్లలో మెసేజ్ లింకులు, డైరెక్ట్‌గా ఫోన్‌కాల్స్ వీడియో కాల్స్ ఇలా...వివిధ రూపాల్లో విజిలెన్స్, ఏసీబీ, సీబీఐ అధికారులం అంటూ బ్లాక్‌మెయిల్, బెదిరింపులకు పాల్పడుతూ అటు ప్రజలు, ఇటు అధికారులను మోసం చేసి సొమ్ము చేసుకుంటున్నారు. మదనపల్లె మండలం సీటీఎం ఏరియాలోని ఇద్దరు ట్రాన్స్‌కో అధికారులు అజ్ఞాత వ్యక్తి చేతిలో తీవ్రంగా నష్టపోయారు. నేడు విజిలెన్స్ అధికారిని మాట్లాడుతున్నాను.. మీరు అక్రమాలకు పాల్పడ్డారు.. నా దగ్గర ఆధారాలు ఉన్నాయని ఇరువురు ట్రాన్స్‌కో అధికారులను బెదిరించి వారి వద్ద నుంచి ఫోన్‌పే ద్వారా లక్ష రూపాయలు వేయించుకున్నాడు. అనంతరం వారు ఆరా తీయగా అతడు నకిలీ అని తాము మోసపోయామని తెలుసుకున్నారు. గతంలో ఇలాంటి రెండు సంఘటనలు జరిగినా బాధితులు గట్టిగా మాట్లాడటంతో వారు సైబర్ నేరగాళ్లకు చిక్కలేదు.

- వివరాలు 6లో

మహానాడు ఏర్పాట్ల పరిశీలన



మహానాడు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు కృష్ణచైతన్యరెడ్డి, ఆర్.మాధవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తదితరులు

సీకేదిన్నె, మే 7 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడు కార్యక్రమానికి సంబంధించి చెర్లోపల్లెలో చేపట్టిన ఏర్పాట్లను కమలాపురం, కడప ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి బుధవారం పరిశీలించారు. టీడీపీ ఏర్పడ్డాక మొట్టమొదటిసారి కడప జిల్లాలో మహానాడు ఏర్పాటు చేస్తుండడంతో ఏర్పాట్లను ప్రత్యేకంగా దగ్గరుండి చూస్తున్నారు. సభాప్రాంగణ వేదికనంతా చదును చేయించి సిద్ధం చేస్తున్నారు. భూమి పూజకోసం అంతా సిద్ధం చేశారు. కూలీలతో చిన్నచిన్న కంపచెట్లు సైతం లేకుండా తొలగిస్తూ డ్రోజర్లతో లెవలింగ్ కార్యక్రమాన్ని చేయిస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, మోహన్‌బాబు, నారాయణ, రాజా, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు పాలకొండ్రాయుడు

● ఆయన మృతి రాష్ట్రానికి, పార్టీకి తీరని లోటు

● నివాళులర్పించిన మంత్రులు జనార్దన్‌రెడ్డి, మండిపల్లి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి



మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడు మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు

రాయచోటిటౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలు మెచ్చిన నాయకుడు మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు అని, ఆయన మృతి పార్టీకి, రాష్ట్రానికి తీరని లోటు అని జిల్లా ఇన్‌చార్జి మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం రాయచోటిలో పాలకొండ్రాయుడు భౌతికకాయానికి మంత్రులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందన్నారు. నాలుగు దశాబ్దాలుగా తన రాజకీయ జీవితం ప్రజలకు అంకితం చేసి ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన ఒక గొప్ప వ్యక్తి అన్నారు. ఆయన మరణం చాలా బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ సుగవాసి పాలకొండ్రాయుడు ఎంపీగా, ఎమ్మెల్యేగా పార్టీకి అనేక సేవా కార్యక్రమాలు చేశారన్నారు. ప్రజల కోసమే రాజకీయ జీవితం ప్రారంభించిన పాలకొండ్రాయుడు మృతి చెందడం చాలా బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నానన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సుగవాసి పాలకొండ్రాయుడు మరణం రాష్ట్రానికి, టీడీపీకి తీరని లోటన్నారు. గతంలో బీసీల సంక్షేమం కోసం ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన మరణించినప్పటికీ ఎల్లవేళలా మా గుండెల్లో ఉంటారన్నారు. వారి కుటుంబానికి ఎల్లవేళలా టీడీపీ పార్టీ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖుల నివాళి

మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ , రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి, జనసేన పార్టీ నాయకులు అతికారి కృష్ణ, సుంకర శ్రీనివాస్, రాజంపేట టీడీపీ నేత ఎద్దుల సుబ్బరాయుడు, ప్రముఖ వైద్యులు బలరామరాజు, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కుమారుడు, రాయచోటి నియోజకవర్గంతో పాటు అన్నమయ్య జిల్లా పరిధిలోని పలు నియోజకవర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, బీజేపీ నాయకులు, జనసేన పార్టీ నాయకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


89 ఎకరాలలో ఎంఎస్ఎంఈ పార్కు



వాల్మీకిపురం మండలంలోని తాటిగుంటపల్లె వద్ద ఎంఎస్ఎంఈ పార్కు స్థలాలు

● నేడు శంకుస్థాపన చేయనున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిగుంటపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఎంఎస్ఎంఈ (మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజస్) పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 89 ఎకరాలలో ఎంఎస్ఎంఈ పార్కు (చిన్న, మధ్య తరగతి కంపెనీలకు) ఏర్పాటు చేయనున్నారు. పీలేరు నియోజకవర్గంలో 2012-14 కాలంలో అప్పటి ప్రభుత్వం 1200 ఎకరాలను ఏపీఐఐసీకి కేటాయించింది. వందలాది మంది రైతుల నుంచి భూసేకరణ పూర్తి చేసి రైతులకు నష్టపరిహారం చెల్లిస్తూ పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు ద్వారా ఇక్కడ నెలకొనే కంపెనీలతో వేలాదిమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కూడా రానున్నాయి. గురువారం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన చేయనున్నారు. తాటిగుంటపల్లె సమీపంలోని ఇండస్ట్రియల్ పార్కు బీ-బ్లాక్ ప్రాంతంలో ఇప్పటికే మౌలిక వసతుల కల్పన దిశగా ప్రభుత్వం వేగవంతంగా అడుగులు వేస్తోంది. ఎంఎస్ఎంఈ పార్కు శంకుస్థాపన కార్యక్రమానికి కలెక్టర్ చామకూరి శ్రీధర్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, రెవెన్యూ అధికారులు తదితరులు హాజరు కానున్నారు.



ఎంఎస్ఎంఈ పార్కు వద్ద ఏర్పాటు చేసిన బోర్డు



ప్రసాద్‌బాబుతో మాట్లాడుతున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి



పాలకొండ్రాయుడు మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

గాలివాన బీభత్సం

● నేలకొరిగిన అరటి ● కల్లాల్లోనే తడిచిన వరి ధాన్యం ● రైతుల ఆశలు ఆవిరి

ఓబులవారిపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి) : మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సానికి వందలాది ఎకరాల్లో పంటలు నాశనమై కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో 112 మంది రైతులకు సంబంధించి సుమారు 177 ఎకరాల్లో అరటి పంటకు నష్టం జరిగిందని హార్టికల్చర్ అధికారులు అంచనా వేశారు. ఇవే కాకుండా స్వల్ప మోతాదుల్లో దెబ్బతిన్న వాటిని లెక్కచేయకపోవడం వల్ల చాలా మంది రైతులు నష్టాలపాలయ్యారు. చిన్నఓరంపాడు, పెద్దఓరంపాడు, ముక్కావారిపల్లె, గాదెల, వై.కోట, బాలిరెడ్డిపల్లె, చిన్నంపల్లె వంటి గ్రామ పంచాయతీల్లో అరటి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక రైతు సుమారు 4 ఎకరాల సాగుకు ఐదు లక్షలకు పైబడే ఖర్చు చేసినట్లు తెలిపారు. అయితే పంట చేతికొచ్చే సమయానికి గాలివాన నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా మానసికంగా ఇబ్బందులకు గురైన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. ఓబులవారిపల్లె గ్రామ పంచాయతీలో పిడుగుపాటుకు ఓబిలి శ్రీనివాసులరెడ్డి ఇంటిలో విద్యుత్ సామగ్రితో పాటు గ్రామంలోని సుమారు 20 ఇళ్లల్లో ఫ్రిజ్‌లు, టీవీలు, కరెంటు పరికరాలు కాలిపోయాయని తెలిపారు.

ఒంటిమిట్టలో...

ఒంటిమిట్ట, మే 7 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలో గాలివాన బీభత్సం సృష్టించింది. బుధవారం తెల్లవారుజామున 2.30 నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో అరటి రైతు కుదేలయ్యాడు. ఒంటిమిట్టలో ఉదయం 7 గంటల వరకు భారీ వర్షం కురిసింది. ఒంటిమిట్ట సమీపంలో రైతులు సుమారు 15 ఎకరాల్లో అరటిపంట సాగు చేశారు. చేతికొచ్చిన పంట ఈదురు గాలులతో కుప్పకూలిపోయింది. దీంతో రైతుల ఆశలు ఆవిరి అయిపోయాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంట చేతికొచ్చే సమయంలో ఇలా జరగడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. ఎకరా అరటి పంట సాగు చేయాలంటే సుమారు లక్ష రూపాయలు ఖర్చు వస్తుందని, వాతావరణం అనుకూలించి పంట చేతికొస్తే ఎకరాకు 2 లక్షల వరకు ఆదాయం వస్తుందని రైతులు తెలిపారు. అలాంటిది అకాల వర్షం కారణంగా తమ పంట నేలకొరిగిపోవడంతో పెట్టుబడి రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. అప్పులు చేసి పంటను సాగు చేస్తే చేతికొచ్చే సమయంలో ఇలా జరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరటి పంటకు నీటికొరత ఏర్పడడంతో నానా తంటాలు పడి నీరు అందించి పంటను సాగు చేస్తే విధి తమతో ఆడుకుందని ఆవేదన చెందారు. మండలంలోని భీమవరం వసుంధర అనే మహిళా రైతు ఆరు ఎకరాల్లో అరటి పంటను సాగు చేశారు. అలాగే నితీశ్వర్‌రెడ్డి అనే రైతు 5 ఎకరాల్లో అరటి పంటను సాగు చేశారు. వీరితో పాటు మరికొందరు రైతులు కూడా అరటి పంటను సాగు చేశారు. ఈదురు గాలులు వర్షంతో తాము తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అప్పు చేసి పంట సాగు చేశాం



చేతిలో డబ్బులు లేకపోయినా అప్పు చేసి అరటి పంటను సాగు చేశాం. చేతికొచ్చే సమయంలో పంట నేలకొరిగిపోవడంతో అప్పు తీర్చలేని పరిస్థితి ఏర్పడింది.

- భీమవరం వసుంధర, రైతు, ఒంటిమిట్ట

ప్రభుత్వం ఆదుకోవాలి



చేతికొచ్చిన పంట నేలపాలు కావడంతో ప్రభుత్వం ఆదుకోవాలి. ఎంతో కష్టపడి ఐదెకరాల్లో పంటను సాగు చేశాను. అకాల వర్షంతో కోలుకోలేని దెబ్బ తగిలింది.

- నితీశ్వర్‌రెడ్డి, రైతు, ఒంటిమిట్ట





సీవో కమ్మపల్లెలో దెబ్బతిన్న అరటి తోట వద్ద రైతు మాడపూరు సుబ్రమణ్యంనాయుడు, దెబ్బతిన్న అరటి తోటను చూపుతున్న రైతు వేమన రవీంద్రనాయుడు



ఈదురుగాలులకు ఒంటిమిట్టలో నేలకొరిగిన అరటి తోట

కల్లాల్లోనే తడిచిన వరి ధాన్యం

చెన్నూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో అకాల వర్షంతో రైతులు అవస్థలు పడ్డారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత కురిసిన వర్షం వరి కోత రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. రెండు రోజుల నుంచి వరి కోతలు చేపట్టిన రైతులు కల్లాల్లోనే ధాన్యం ఆరబెట్టుకోగా మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత కురిసిన భారీ వర్షంతో కల్లాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం మొత్తం తడిసిపోయింది. దీంతో ఆ రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. రబీ సీజనులో వేసవిలో కోతకు వచ్చే విధంగా వరి సాగు చేపట్టిన రైతులు కాసింత ఆలస్యంగానే వరి సాగు చేపట్టారు. కాగా చాలా వరకు ఏప్రిల్ 15 నాటికి వరి కోతలు పూర్తయ్యాయి. అంతో ఇంతో మిగలిన రైతులు గత వారం రోజులుగా వరి కోతలు చేపట్టారు. సోమ, మంగళవారాల్లో వరిని కోస్తున్న రైతులకు అనుకోకుండా వచ్చిన వర్షం పెద్ద దెబ్బతీసింది. మండలంలోని బుద్దాయపల్లెకు చెందిన శ్రీనివాసులరెడ్డి, ఉమాదేవి, పరమేశ్వర్‌రెడ్డి, ఇలా మరి కొంతమంది రైతుల ధాన్యం కల్లంలో తడవడంతో ఆరబెట్టి అమ్ముకోవాలన్నా ఇంట్లో వేసుకోవాలన్నా నష్టపోతామని ఆవేదన చెందుతున్నారు. పైగా ప్రభుత్వం కూడా ప్రస్తుతం ధాన్యాన్ని ముఖ్యంగా జిల్లా ప్రాంతంలో కొనుగోలు చేసేందుకు సుముఖత వ్యక్తం చేయకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందేమోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బుద్దాయపల్లె వద్ద వరిపొలాల్లో తడిచిన ధాన్యం



రోడ్డుపై ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు

పౌరుల బాధ్యతే ముఖ్యం

● ఏపీఎండీసీలో మాక్ డ్రిల్



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఓబులవారిపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): భారతదేశం- పాకిస్థాన్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణంలో విపత్కర పరిస్థితుల్లో ప్రజలను రక్షించుకునేందుకు కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ఏపీఎండీసీ మంగంపేటలో సంక్షోభం సమయంలో ప్రాణాలు ఎలా కాపాడుకోవాలి అన్న అంశాలపై అవగాహన కల్పించారు. అందులో భాగంగా సీపీఆర్ అందించడం, గాయాలపాలైన వారిని ఆసుపత్రికి తరలించడం, అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఫైర్‌శాఖ వారిని సంప్రదించి ప్రమాదాల నుంచి రక్షణ పొందడం వంటి వాటిని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అలాగే పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్‌రావు, సీపీవో సుదర్శన్‌రెడ్డి, మైన్స్ మేనేజర్ గోపినాథ్, ఎస్ఐ మహేష్, ఎస్పీఎఫ్ ఎస్ఐ శివ, సిబ్బంది, కోడూరు ఫైర్ సేఫ్టీ అధికారులు, సిబ్బంది త్రివేణి జీఎం, డిప్యూటీ మేనేజర్ చలపతిరెడ్డి, హెచ్‌ఆర్‌డీ నారాయణరెడ్డి, ఏపీఎండీసీ ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

పోక్సో కేసులో కర్ణాటక వాసి అరెస్టు

కలికిరి, మే 7 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసు నిందితుడు కర్ణాటక రాష్ట్రం హసన్ పట్టణానికి చెందిన జె.ఎస్.రాజేశ్ అలియాస్ సునీల్ (24)ను బుధవారం కలికిరి క్రాసు రోడ్డులో అరెస్టు చేసి వాల్మీకిపురం కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ రెడ్డిశేఖరరెడ్డి తెలిపారు.

కలికిరి పట్టణంలో బేకరీ నిర్వహిస్తున్న అతను హసన్ ప్రాంతానికే చెందిన ఓ బాలికను మోసగించడంతో ఆమె ఓ బిడ్డకు జన్మనిచ్చిందన్నారు. ఆ బాలిక ఫిర్యాదు మేరకు హసన్‌లో కేసు నమోదు కాగా, ఆ కేసు కలికిరికి బదిలీ అయ్యిందన్నారు. దీంతో తాము అతడిని బుధవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండు విధించారని సీఐ తెలిపారు.

రైతు ఫిర్యాదుతో జేసీ పర్యటన



రైతు షెడ్డును పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

సిద్దవటం, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుమలోపల్లె రెవెన్యూ పొలం గ్రామానికి చెందిన రైతు శివకుమార్ ఫిర్యాదుతో కడప జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ బుధవారం కనుమలోపల్లె గ్రామంలో పర్యటించారు. నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా రైతు శివకుమార్ రేకుల షెడ్డు నిర్మాణానికి నష్టపరిహారం కింద డబ్బులు తక్కువ ఇచ్చారని జేసీకి ఫిర్యాదు చేయడంతో విచారణ నిమిత్తం ఆమె పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం కడప-చెన్నై జాతీయ రహదారి పక్కనున్న జేఎంజే కళాశాల వద్ద పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంతాలను పరిశీలించారు. మండలంలో ప్రజల సమస్యలు పరిష్కరించాలని జేసీ సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో జాన్ ఇర్విన్, ఇన్‌చార్జి మండల తహసీల్దారు మాధవీలత, ఆర్‌అండ్‌బీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సౌమ్యనాథస్వామి హుండీ లెక్కింపు

నందలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు సౌమ్యనాథస్వామి హుండీని బుధవారం లెక్కించగా రూ.2,64,921 వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీని నెలరోజుల తర్వాత లెక్కించామన్నారు. వచ్చిన మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి జనార్దన్, భక్తులు పాల్గొన్నారని తెలిపారు.



హుండీ డబ్బును లెక్కిస్తున్న దృశ్యం

ఇందిరమ్మ కాలనీలో బెల్టు షాపులు...!

మహిళల పట్ల మందుబాబుల అసభ్య ప్రవర్తన

గుర్రంకొండ, మే 7 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ ఇందిరమ్మకాలనీలో బెల్టుషాపుల జోరుతో మద్యం వ్యాపారం మూడు పువ్వులు..ఆరు కాయలుగా సాగుతోంది. ఇందిరమ్మ కాలనీ, ఎన్టీఆర్ కాలనీలో సుమారు 700 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ కాలనీలో కొన్ని నెలలుగా మద్యం వ్యాపారం జోరుగా జరుగుతోంది. ఇందులో భాగంగా కాలనీలో ఆరు బెల్టు షాపులను అక్రమంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఈ బెల్టుషాపుల్లో వేలాది రూపాయల మద్యం వ్యాపారం చేస్తున్నారు. బెల్టుషాపు నిర్వాహకులు ఉదయం 6 గంటల నుంచే మద్యంను విక్రయిస్తున్నారు. దీంతో మద్యం కోసం మందుబాబులు తెల్లారకనే బెల్టు షాపుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మద్యం తాగి వీధుల్లో తూలుతూ ఎక్కడపడితే అక్కడ పడిపోతున్నారు. అంతే కాకుండా వీధుల్లో ఉండే మహిళలపై మందుబాబులు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు మహిళలు వాపోతున్నారు. బెల్టుషాపుల నిర్వహణపై ఎక్సైజ్, పోలీసులకు తెలిపినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై వాల్మీకీపురం ఎక్సైజ్ సీఐ లత వివరణ కోరగా ఇందిరమ్మ కాలనీలో బెల్టు షాపులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. బెల్టుషాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

కురబలకోట, మే 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం మేరకు... పెద్దమండ్యం మండలం శెట్టివారిపల్లెకు చెందిన వెంకటేష్ కుమారుడు వెంకటరమణ (22) మండలంలోని అంగళ్లు సమీపంలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ చదువుతున్నాడు.

బుధవారం తన స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనంలో కళాశాలకు వెళుతూ ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో కిందపడ్డాడు. అదే సమయంలో ఆ మార్గాన వెళుతున్న ట్రాక్టర్ అతడిపై దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ ప్రమాదంలో గాయపడ్డ మరో విద్యార్థి శశిధర్ మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

నేను విజిలెన్స్ డీఎస్పీని..సస్పెండ్ చేస్తా జాగ్రత్త..!

- మీ అక్రమాలు చాలానే ఉన్నాయి..సర్దుకోండి
- ట్రాన్స్‌కో అధికారులకు అజ్ఞాత వ్యక్తి ఫోన్
- ఫోన్‌లో బెదిరింపు...రూ.లక్ష ట్రాన్స్‌ఫర్
- మోసపోయిన బాధితులు..ఫిర్యాదుకు ససేమిరా
- విజిలెన్స్, ఏసీబీ, సీఐడీ పేరుతో మోసాలు



మదనపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): మోసపోయే వాళ్లు ఉన్నంత వరకు మోసం చేసే వాళ్లు పుట్టుకొస్తూనే ఉంటారు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ క్రైం నేరగాళ్లు కూడా పెరిగిపోతున్నారు. ఇందుకు ఫోన్లలో మెసేజ్ లింకులు, డైరెక్ట్‌గా ఫోన్‌కాల్స్, వీడియో కాల్స్ ఇలా...వివిధ రూపాల్లో విజిలెన్స్, ఏసీబీ, సీబీఐ అధికారులం అంటూ బ్లాక్‌మెయిల్, బెదిరింపులకు పాల్పడుతూ అటు ప్రజలు, ఇటు అధికారులను మోసం చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇందులో అక్షరజ్ఞానం లేని సామాన్యుడి నుంచి నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉన్నతాధికారులు కూడా బలవుతున్నారు. కొందరు పోలీసులను ఆశ్రయిస్తుండగా మరికొందరేమో ఎటూ మోసపోయాం..నష్టపోయాం బయటకు తెలిస్తే పరువుపోతుందని బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇలాంటి సంఘటనలు, ఉదంతాల నుంచి అప్రమత్తం చేసే క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నాయి. చివరకు ఫోన్ డయిలింగ్‌లోనూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌ల నుంచి జాగ్రత్తగా ఉండాలని, అనుమానం వస్తే సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నెంబర్-1930 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. అయినా చాలామంది వీటిని పెడచెవిన పెడుతున్నారు. అజ్ఞాత వ్యక్తుల మాటలు విని, బెదిరింపులకు భయపడి తీవ్రంగా నష్టపోతున్నారు. ఇందుకు నిదర్శనమే..జిల్లాలోని మదనపల్లె డివిజన్‌లో తాజాగా జరిగిన సంఘటనలివీ.

మదనపల్లె మండలం సీటీఎం ఏరియాలోని ఇద్దరు ట్రాన్స్‌కో అధికారులు అజ్ఞాత వ్యక్తుల చేతిలో తీవ్రంగా నష్టపోయారు. వారం రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ట్రాన్స్‌కోలోనే కాదు స్థానికంగా తీవ్రమైన చర్చ నడుస్తోంది. మదనపల్లె-తిరుపతి ప్రధాన రహదారి వెంట ఇటీవల రోడ్డు విస్తరణ పనులు, సీటీఎంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇక్కడ విద్యుత్తు శాఖ, జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో విద్యుత్తు స్తంభాలు, లైన్ల మార్పుతో పాటు కొత్తగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ముసుగులో సమీపంలోని రైతులు, ప్రైవేటు వ్యక్తుల భూములు, స్థలాల్లో ఉన్న వాటిని అనధికారికంగా మార్పు చేసినట్లు చెబుతున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో వివరాలు రాబట్టిన అజ్ఞాత వ్యక్తి తాను విజిలెన్స్ డీఎస్పీని అంటూ ట్రాన్స్‌కో అధికారికి ఫోన్ చేసి బెదిరించాడు. విద్యుత్తు పనుల్లో అక్రమాలకు పాల్పడ్డారని, తన వద్ద ఆధారాలు ఉన్నాయని..ఒకటి, రెండు అంశాలను ఫోన్‌లో వివరించినట్లు తెలిసింది. మీపై చర్యలు తీసుకుంటామని, సస్పెండ్ చేస్తామని బెదరింపు ధోరణితో హెచ్చరించినట్లు సమాచారం. దీంతో బయపడిన ఆ అధికారి వెంటనే తన కిందస్థాయి అధికారిని లైన్‌లోకి తీసుకుని మాట్లాడమని చెప్పారు. ఆ అజ్ఞాత వ్యక్తి ఇదే స్థాయిలో వివరాలు చెప్పి బెదిరించడంతో ఆయన కూడా కాస్త మెత్తబడ్డారు. సార్ అలా చేయొద్దని, తాను మీతో మాట్లాడుతానని చెప్పడంతో ఫోన్‌పేలో డబ్బులు వేయమని లైన్‌లో ఫోన్‌లో మాట్లాడుతుండగానే, మరో నెంబరు ఇచ్చి డబ్బులు వేయమన్నాడు. అంతే ట్రాన్స్‌కో కిందిస్థాయి అధికారి వెంటనే లక్ష రూపాయలు అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన ఫోన్ నెంబర్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. తర్వాత సీన్ కట్ చేస్తే..అతనెవరో తెలీదు. ఫోన్ నెంబర్లు పనిచేయడం లేదు. చివరకు మోసపోయామని తెలుసుకున్న ఇద్దరు ట్రాన్స్‌కో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో ఉన్నతాధికారి దృష్టికి తెస్తే..విషయం బహిర్గతం కాకుండా, చేయకుండా సర్దుబాటు చేశారు. మోసపోయామని తెలుసుకున్న వారిద్దరూ..పోయిన డబ్బుల కోసం పంచాయితీ పెట్టారు. నాపై అధికారి చెబితే సమస్య లేకుండా మ్యానేజ్ చేశానని బాధితుడు..కాదు మాట్లాడమని మాత్రమే తాను చెప్పానని, ఒకేసారి డబ్బులు చెల్లించమని చెప్పలేదని ఆ అధికారి వాదించుకుంటున్నారు. ఈ విషయం సహచరుల దృష్టికెళ్లగా, ఫోన్ నెంబర్ల ఆధారంగా ఫిర్యాదు చేద్దామంటే వద్దంటున్నారు. ఇద్దరు బాధితుల్లో ఒకరు వచ్చే నెలలో పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఫిర్యాదులు, కేసులు ఎందుకని, ఇన్నాళ్ల సర్వీసులో ఎప్పుడూ ఇలాంటి సంఘటన జరగలేదని, ప్రశాంతంగా ఇంటికెళ్లిపోతే పోతుందులే అన్నట్లు ఉండిపోయారు.

● నేను ఏసీబీ అధికారి కసిరెడ్డిని మాట్లాడుతున్నా..నీపై దగ్గర్లోనే రైడ్ చేస్తున్నాం..అరెస్టు చేస్తున్నానమంటూ గత ఏడాది నవంబరు 7వ తేదీ మదనపల్లెలోని ట్రాన్స్‌కో అధికారి ఫోన్ చేశాడు. నిన్ను లోపల వేశాకే తెలుస్తుంది..అరెస్టు చేశాక నీకు అర్థమవుతుంది..మా వాళ్లంతా బయలుదేరుతున్నారు.. హైదరాబాద్ నుంచి అంటూ వీడియో కాల్‌లో కార్యాలయాన్ని చూపించాడు. ఏదో చూడంటి సార్..అంతా మీ చేతుల్లోనే ఉంది.. మీరే కాపాడాలని ఆయన అతడిని ఫోన్‌లో వేడుకున్నాడు. ఫోన్‌లైన్‌లో మాట్లాడుతూనే, అంతలో ఫోన్‌పే నెంబరు ఇచ్చి డబ్బులు వేయమని సూచించాడు. ఆ నెంబరు తీసుకుని సర్, మీరెక్కడున్నారు.. నేను పర్సనల్‌గా మీతో మాట్లాడాలని బాధితుడు చెప్పాడు. ఇది హైదరాబాద్ అని చెప్పడంతో బాధితునికి కాస్త ధైర్యం వచ్చి..తిరిగి అతడితో మాట్లాడారు. మీరు ఇందాక వీడియోకాల్‌లో చూపించిన కార్యాలయం ఎక్కడ సార్ అని ఆరా తీయగా, ఇది హైదరాబాద్ ఏసీబీ కార్యాలయం అని సమాధానం రావడంతో బాధితుడు మరింత ధైర్యం తెచ్చుకుని ఎదురుతిరిగాడు. నేను ఉద్యోగం చేస్తున్నది ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా తిరుపతి సర్కిల్‌లో తెలంగాణాకు, ఏపీకి సంబంధం ఏంటని బాధితుడు ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఇతను కూడా బెదిరింపు ధోరణితో మాట్లాడటంతో కాల్ కట్ చేసేశాడు. భయపడకుండా ధైర్యంగా ప్రశ్నించడంతో ఆయన మోసం నుంచి తప్పించుకున్నాడు.

● బి.కొత్తకోటకు చెందిన మరో ట్రాన్స్‌కో అధికారికి ఈ ఏడాది జనవరిలో విజిలెన్స్ ఎస్పీని అంటూ ఫోన్ వచ్చింది. వెంటనే నీవు నాకు లక్ష రూపాయలు ట్రాన్స్‌ఫర్ చేయాలని లేకుంటే వెంటనే సస్పెండ్ చేస్తానని బెదిరించాడు. దీంతో భయపడిపోయిన ఆయన రెండురోజులు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. దీంతో అజ్ఞాత వ్యక్తి మోసం నుంచి బయటపడ్డాడు. తీరా చూస్తే..తర్వాత అలాంటిదేమీ జరగకపోవడంతో మోసం నుంచి గట్టెక్కానని బాధితుడు ఊపిరి పీల్చుకున్నాడు. ఇలా వరుసగా విద్యుత్తు శాఖ అధికారులు, సిబ్బందికే బెదిరింపు కాల్స్ రావడంపై ఆ శాఖాధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వివాదాస్పద నిర్మాణాలపై ఏఎస్పీ విచారణ



నిర్మాణాలపై విచారణ చేస్తున్న ఏఎస్పీ మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే

రాజంపేటటౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణం డీబీఎస్‌పల్లె అరుంధతివాడ చుట్టూ కొందరు ఏర్పాటు చేసుకున్న గోడ నిర్మాణాలను బుధవారం ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే పరిశీలించి విచారణ చేశారు. ఈ నిర్మాణాలపై కొందరు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ విచారణ చేపట్టారు. ఎగువ అరుంధతివాడ, దిగువ అరుంధతివాడ ప్రజలతో మాట్లాడారు.

అగ్రవర్ణాల వారు వివక్షతో తమ గ్రామం చుట్టూ ఎత్తయిన గోడలు నిర్మించి తమను సామాజిక బహిష్కరణకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అంటరానితనంతో కుల వివక్షతతో తమ గ్రామం చుట్టూ ఎత్తయిన గోడలు నిర్మించడం దారుణమన్నారు. వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన పూర్వాపరాలను ఉన్నతాధికారులకు తెలియజేసి చర్యలు తీసుకుంటామని వారికి ఏఎస్పీ హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

ఓబులవారిపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారి మంగంపేట పరిసరాల్లో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొని పలువురికి గాయాలయ్యాయని ఎస్ఐ మహేష్ తెలిపారు. రైల్వేకోడూరు నుంచి రాజంపేట వైపు వెళుతున్న స్కార్పియో వాహనం, ఓబులవారిపల్లె నుంచి రైల్వేకోడూరుకు వెళుతున్న ఆటో ప్రమాదవశాత్తు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఇరువాహనాల డ్రైవర్లు సుభాన్, అజయ్ కాగా మరొక వ్యక్తికి గాయాలు కావడంతో 108 ద్వారా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెన్నా తీరంలో... ప్రమాద ఘంటికలు

- కరకట్టలు లేకపోతే...వరదనీటితో ముప్పు
- ఏటా కోతకు గురవుతున్న నదీ తీరం
- ఆందోళనలో పరివాహక గ్రామాల ప్రజలు


చెన్నూరు వద్ద వంతెన వైపు కోతకు గురైన పెన్నాతీరం

పెన్నాతీర ప్రాంతం ఏటా కోతకు గురవుతోంది. 50 ఏళ్ల నాడు నిర్మించిన కరకట్టలు దాదాపు దెబ్బతినడంతో వరద నీరు వచ్చినప్పుడల్లా నీటి ఉధృతికి పెన్నా తీరం క్రమేపీ కోతకు గురవుతోంది. వర్షాకాలంలో నదిలో నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నపుడు నదీ పరివాహక గ్రామాల ప్రజలు ఎప్పు డు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.
వెంటనే నదికి ఇరువైపులా రాతి కరకట్టలు నిర్మించి ప్రాణ, ఆస్థి నష్టం జరగకుండా కాపాడాలని పరివాహక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చెన్నూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు మండలంలోని పెన్నాతీరం ప్రాంతంలో గల గ్రామాలన్నింటికీ ఆదే పరిస్థితి ఉంది. ప్రతి ఏటా వర్షాకాలంలో కుందూ, పాపాఘ్ని నదుల నుంచి వరద నీరు వచ్చి పెన్నానదిలో కలిస్తే నీటి ఉధృతి ఎక్కువగా ఉంటుంది. దాదాపు 25 అడుగుల మేర.. లక్ష క్యూసెక్కుల పైన వరద నీరు పెన్నానది నుంచి ప్రవహిస్తూ సోమశిల వైపు దూసుకెళుతుంది. ఇలా దాదాపు 70, 80 ఏళ్లుగా వరదనీరు ప్రవహిస్తుండడంతో పెన్నా తీరమంతా క్రమేపీ కోతకు గురైంది. గతంలో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా... తీరం వెంబడి రాతికట్టడం కట్టాలన్నా, కరకట్టలు నిర్మించాలని కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుందని.. నీటి పారుదల, పంచా యతీ రాజ్‌శాఖ అధికారులు చేతులెత్తేశారు.

50 ఏళ్ల క్రితం కట్టిన కరకట్టలే

పెన్నానదిలో ప్రవహించే వరద నీటి ఉధృతికి తీరం కోతకు గురికాకుండా.. 1975 ప్రాంతంలో చెన్నూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ పీటీ వీరారెడ్డి రాష్ట్రస్థాయి అధికారులను ఒప్పించి నది లో తొమ్మిది చోట్ల కరకట్టలు ఏర్పాటు చేశారు. కొక్కిరాయపల్లె నుంచి చెన్నూరు గ్రామ పంచా యతీ చివరి వరకు నదిలోకి సుమారు 10 నుంచి 12 అడుగుల మేర కరకట్టలు నిర్మించారు. దీంతో నదిలో నీరు ఎంత ఉధృతంగా ప్రవహించినా నీరు తీరం వైపు రాకుండా నదిలో ప్రవహించేది. పాతికేళ్ల వరకు ఇబ్బంది లేకుండా ఉండేది. ఏటా వరద నీటి ఉధృతికి కరకట్టలు క్రమేపీ దెబ్బతింటూ వచ్చాయి. దీంతో వరద నీరు ఎక్కువగా వచ్చినప్పుడు కరకట్టలపై పొంగి ప్రవహిస్తూ తీర ప్రాంతం కోతకు గురై.. వరద నీటిలో వచ్చే విషసర్పాలు తీర ప్రాంత ఇళ్లల్లోకి వస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి నదీ తీరం వెంబడి దెబ్బతిన్న కరక ట్టలను పునఃనిర్మించాలని పరివాహక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


చెన్నూరు వనం వీధికి కింది భాగంలో కోతకు గురైన పెన్నాతీరం

గతంలో రూ.10లక్షలు మాత్రమే నిధులు మంజూరు

పెన్నాతీరం కోతకు గురవుతుందని 23 ఏళ్ల క్రితం అప్పటి ఉప మండలాధ్యక్షురాలు ఈ విషయాన్ని అప్పట్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. రూ.10 లక్షలు మాత్రం మంజూరు చేశారు. దీంతో చెన్నూరు కొండపేట వంతెన మొదట్లో మైనార్టీ కాలనీ వైపు ఏటి వెంబడి కొంత వరకు గోడ నిర్మించారు. ఆ తరువాత ఒక్కపైసా కూడా నిధులు మంజూరు కాలేదు. దాదాపు 30 ఏళ్లుగా ప్రజలు పెన్నాతీరం కోతకు గురవుతుందని నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

వానా కాలం వస్తే భయమేస్తుంది



వానాకాలం వస్తే.. వరద నీటి ఉధృతి చూస్తే భయం వేస్తుంది. నదిలో నీళ్ల ఊరిపైకి వస్తాయేనోనని టెన్షన్‌గా ఉంటుం ది. ఏటికి ఇరువైపులా మట్టికట్ట అంతా కోసుకుపోయింది. దీంతో ఏటిలో పూడ్చేం దుకు శవాలు తీసుకెళ్లాలన్నా దారి లేకుండా పోయింది. అంతకు ముందు పోయే దారి వరద నీటి ఉధృతికి కోతకు గురైంది. అధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి రాతికట్టలు కట్టాలి.

- కుందేటి క్రిష్ణయ్య, వనంవీధి, చెన్నూరు

నదికి రెండు వైపులా రాతి కట్టలు కట్టాలి



రెండేళ్లక్రితం పెన్నానదికి ఉధృతంగా ప్రవహించడంతో చెన్నూరు వైపు ఇళ్లలోకి నీళ్లు వచ్చాయి. కొండపేట వైపు చాలా వరకు కోతకు గురైంది. వరద నీటి ఉధృతి తట్టుకోవాలంటే నదికి ఇరువైపులా మట్టి కోతకు గురికా కుండా రాతికట్టలు కట్టాలి. 25 ఏళ్ల క్రితం కొద్దిగా నిధులు వచ్చాయి. ఇళ్లు, భూములు వరద నీటితో దెబ్బతిన కుండా కరకట్టలు నిర్మించాలి.

- ఎం.మోహన్‌రెడ్డి,. మాజీ సర్పంచ్, కొండపేట

అర్హుల జాబితా సిద్ధం చేయండి : ఆర్డీవో


జెడ్‌హెచ్‌డీసీ భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్

పోరుమామిళ్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): అసైన్‌మెంటు కమిటీలో భూములను పేదలకు పంచేందుకు అర్హుల జాబితాను సిద్ధం చేయాలని ఆర్డీవో చంద్ర మోహన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని చల్లగిరిగెల పంచాయతీలో జెడ్‌హెచ్‌డీసీ భూములను అర్హులైన పేదలకు పంచేందుకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. అనంతరం ఎల్లోపల్లె సమీపంలో ఉన్న జెడ్‌హెచ్‌సీ భూములను పరిశీలించారు. సర్వే నెంబర్లు 4, 10, 11, 12, 13, 14, 15, 322 నుంచి 343 వరకు గల 351.61 ఎకరాల సంబంధించిన భూముల రికార్డులు పరిశీలించి భూములను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, వీఆర్వోలతో మాట్లాడుతూ భూములకు సంబంధించి సమగ్ర సర్వే నిర్వహించి అర్హుల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండా రామక్రిష్ణారెడ్డి, ఆర్‌బి సుధాకర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమత్ జయంతి ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం

చక్రాయపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 19 నుంచి 22 వరకు జరగనున్న హనుమత్‌జయంతి ఉత్సవాలకు దేవాదాయ ధర్మదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డిని ఆహ్వానించారు. బుధవారం నెల్లూరు లోని మంత్రి స్వగృహంలో గండి ఈఓ వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామిలు ఆహ్వానించారు. అనంతరం హనుమత్ జయంతి కరపత్రాలను మంత్రి చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ గండికి వస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గండి క్షేత్రంలో జరిగే అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు.

తెల్లరేషన్ కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పౌరులకు మెరుగైన సేవలను అందించాలనే లక్ష్యంతో బుధవారం నుంచి జిల్లాలో గ్రామ, వార్డు, సచివాలయాల్లో కొత్త బియ్యం కార్డులు, మార్పులు, చేర్పులకు సంబంధించి ఏడు రకాల సేవలను ప్రారంభించినట్లు జేసీ అదితిసింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త బియ్యం కార్డులు, బియ్యం కార్డులో కొత్త సభ్యుల పేర్లు చేరిక, తొలగించుట, అవసరం లేని కార్డులను సరెండర్ చేయుట, చిరునామాలు మార్చుట, తప్పుడు ఆధార్‌కార్డు సీడింగ్ జరిగి ఉంటే సరిదిద్దుకునేందుకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఈ సేవలు గతంలో ఆమోదించిన ప్రామాణిక ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం అందజేస్తామని తెలిపారు. ఇప్పటికే ఉన్న ధ్రువీకరణలను, ఇతర డేటా బేస్‌లు కలుపుకొని క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారుల సమన్వయంతో అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని తెల్లకార్డు దారులందరూ సద్వినియోగం చేసుకోవాలని జేసీ ఆప్రకటనలో పేర్కొన్నారు.

ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్త... ప్రభుత్వ ధ్యేయం


కొప్పర్తిలో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి తదితరులు

సీకేదిన్నె, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. అందులో భాగంగా కొప్పర్తి పారిశ్రామికవాడలో ఎంఎస్ఎంఈ ప్రాజెక్టు ద్వారా పరిశ్రమలను స్థాపించడానికి బుధవారం శంకుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికంగా అభివృద్ధి చెంది వారు ఉపాధి పొందడంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ప్రభుత్వం భారీ పెట్టుబడులు పెట్టలేని వారి కోసం చిన్న చిన్న వ్యాపారాలను ప్రోత్సహించేందుకు కూడా ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఇతర రాష్ట్రాలకు పోయి వ్యాపారాలు పెట్టే బదులు స్థానికంగా ఉండే అవకాశాలను ఉపయోగించుకుని పరిశ్రమలు పెడితే ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహకం అందిస్తుందన్నారు. కొప్పర్తిని ప్రజా ఇండ్రస్ట్రియల్‌పార్కు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇప్పటికే కొన్ని పరిశ్రమలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొప్పర్తిలో రైల్వేలు, రోడ్డుమార్గం, విమాన మార్గాలు అందుబాటులో ఉండడంతోపాటు నీటి సౌకర్యం కూడా పుష్కలంగా ఉందని, ఈ అవకాశాలను యువపారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోగటం సుజాత, నేతలు కృష్ణారెడ్డి, మోహన్‌బాబు, జనార్ధన్‌రెడ్డి, శ్రీను, ఓబుళరెడ్డి, మహేష్, నజీర్, వీరకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీ సీఈగా వాసుదేవరావు

ఎర్రగుంట్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎంవీఆర్ఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్‌గా జి.వాసుదేవరావు నియమితులయ్యారు. ఆయన లోయర్ సీలేరు హైడల్ పవర్ స్టేషన్ చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వస్తున్నారు. అలాగే ఇక్కడ చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న గౌరీపతి విద్యుత్ సౌదలో చీఫ్ జనరల్ మేనేజర్ అడ్మినిస్ట్రేషన్‌గా బదిలీపై వెళుతున్నారు. ఆయన బుధవారం రాత్రే ఆర్టీపీపీ నుంచి రిలీవ్ అయ్యి గురువారం విద్యుత్ సౌదలో రిపోర్టు చేయనున్నట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతి చెందిన ధర్మారావు (ఫైల్)

లింగాల, మే 7 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పార్నపల్లెకు చెందిన పాముల ధర్మారావు (25) ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఎస్ఐ మధుసూదన్‌రావు కథనం మేరకు వివరాలిలా.. ధర్మారావు తన తండ్రి ఎరికలప్పతో కలిసి మంగళవారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లారు. వరిపంట కోత కోయించారు. పశువులు పొలంలోకి వస్తాయని భావించి ఎరికలప్ప కుమారునితో విద్యుత్ వెర్లను తీసివేసి ఇంటికి రమ్మని వెళ్లిపోయాడు. రాత్రి అయినా కుమారుడు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి పొలంలోకి వెళ్లి చూడగా.. విద్యుదాఘాతంతో స్పృహ తప్పి పడిపోయి ఉన్నాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆటో, టిప్పర్ ఢీ... నలుగురికి గాయాలు

ఎర్రగుంట్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జువారి సిమెంట్ కర్మాగారం సమీపంలో బుధవారం తెల్లవారుజమున జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. వీరపునాయునిపల్లె మండలంలోని కీర్తిపల్లెకు చెందిన వారు ప్రొద్దుటూరుకు కూరగాయలు తెచ్చేందుకు ఆటోలో వెళుతున్నారు. జువారి సిమెంట్ కర్మాగారం సమీపంలో వేగంగా వచ్చిన టిప్పర్ ఢీ కొంది. దీంతో ఆటోలో ఉన్న వెంకటరామిరెడ్డి, అంకిరెడ్డి తదితరులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని 108లో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. ఎర్రగుంట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ నిర్వహణకు నిధులు మంజూరు చేయాలి

- వెలగచర్ల గ్రామస్థుల వినతి


వెలగచర్ల గ్రామస్థులు నిర్మించుకున్న రామాలయం

పెనగలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): పెనగలూరు మండలం వెలగచర్ల గ్రామంలో గ్రామస్థులు నూతనంగా శ్రీరామ ఆలయాన్ని నిర్మించుకున్నారు. అందరూ చందాలు పోగు చేసి లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఆలయాన్ని నిర్మించారు. అయితే ధూప దీప నైవేద్యం ఆలనాపాలన చూసుకోవడానికి తమకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ ఆలయాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని దేవదాయశాఖకు అప్పగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆలయంలో దూపదీప నైవేద్యపు ఆలనాపాలన ఖర్చులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈమేరకు దేవదాయ ధర్మాదాయ శాఖకు గ్రామస్థులు విన్నవించారు.

ధూప దీప నైవేద్య ఖర్చులు ఇవ్వండి



గ్రామంలో సుమారు 100 కుటుంబాలు పైబడి ఉన్నాయి. అందరం చందాలు పోగు చేసి ఇటీవల నూతనంగా రామాలయం నిర్మించుకున్నాం. ఈ ఆలయాన్ని దేవదాయశాఖలో విలీనం చేసుకుని ధూప దీప నైవేద్య ఖర్చులు ఇవ్వాలి.

-అబ్బిగారి వెంగయ్య, వెలగచర్ల గ్రామం,

దేవదాయశాఖలో విలీనం చేసుకోవాలి



దేవదాయ ధర్మాదాయశాఖ తమ ఆలయాన్ని వెంటనే విలీనం చేసుకోవాలి. ప్రభుత్వం తరపున ధూప దీప నైవేద్యానికి అందజేసే నెలసరి పారితోషకం మంజూరు చేయాలి.

-ఏనుగుల శంకరయ్య,
విశ్రాంత ప్రధానోపాధ్యాయులు

భక్తులతో కిటకిటలాడిన బ్రహ్మంగారిమఠం


దీక్షా అలంకరణ గుడి ఉత్సవంలో బ్రహ్మంగారు


బ్రహ్మంగారి దర్శనం కోసం క్యూలైనులో వేచి ఉన్న భక్తులు

బ్రహ్మంగారిమఠం, మే 7 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాల సందర్భంగా నాలుగోరోజు స్వామి సజీవసమాధి వహించిన పవిత్ర దినం కావడంతో పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుండే భక్తులు క్యూలైనులో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 5 గంటలకు వీరబ్రహ్మ సుప్రభాతం, నామసంకీర్తనం, 8గంటలకు అభిషేకం, సహస్రనామార్చన, మధ్యాహ్నం 12 గంటలకు దీక్ష బంధనాలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదార్లు ఇరగంరెడ్డి నాగిరెడ్డి, వెంకటరమణ, ప్రొద్దుటూరు వాస్తవ్యులు గుడి ఉత్సవం చేపట్టారు. మధ్యాహ్నం ఆలయ ప్రాం గణంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు, తాగునీరు, భోజనవసతి ఆలయ ఫిట్ ఫర్సన్ శంకరబాలాజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సాయంత్రం 6గం టలకు కంది మల్లయపుర సంస్థాన ఆస్థాన విద్వాంసులు పెద్దపాటి నాగేశ్వర్‌రావు ఉప న్యాసం చేశారు. రాత్రి 8గంటలకు సప్తభారతి భగవతారిణిచే హరి కథా కాలక్షేపం చేశారు. ఆస్థాన పండితులు ఇడమకంటి జనార్ధనచార్యు లు, పోలూరి బాలబ్రహ్మం ఆచార్యులు ఆలయ ప్రాంగణంలో భక్తులకు బ్రహ్మంగారి కాలజ్ఞానం, జీవిత చరిత్ర గురించి ఉపన్యాసం ఇచ్చారు. రాత్రి 11గంటలకు నరనంది ఉత్సవంపై వీరబ్రహ్మేంద్ర స్వామి సమేత గోవిందమాంబ భక్తులకు దర్శనమిచ్చారు. వల్లూరు మండలం పెద్దపుత్త గ్రామానికి చెందిన తాడిగొట్ల వీరారెడ్డి, నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా చేరారు. కాగా, ఆరాధన గురుపూజ మహోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం 4 గంటల నుంచి వీరబ్ర హ్మేంద్రస్వామి దేవస్థానం మాడ వీధుల గుండా బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహిస్తారు.

రూ.7.48 లక్షల నిధులు రికవరీకి ఉత్తర్వులు జారీ

వీరబల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సానిపాయి గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ అధికారులు విచారించారు. ఈ మేరకు రూ.7.48 లక్షల నిధులు దుర్వినియోగం చేశారని ధ్రువీకరిస్తూ నివేదికలను జిల్లా పంచాయతీ అధికారికి, జిల్లా కలెక్టర్‌కు అందజేశామని తెలిపారు. ఇదిలా ఉండగా సదరు పంచాయతీలో నిధులు దుర్వినియోగమైనట్లు జనసేన మండల కన్వీనర్ గుగ్గిళ్ల వెంకటేశ్, టీడీపీ నేతలు నేతి రమేశ్‌బాబులు, నేతి రామ్మోహన్‌ల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ ఆంజనేయులు నుంచి రికవరీ చేయుటకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా మండల రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

వైభవంగా గరుడసేవ

పుల్లంపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): పుల్లంపేటలోని భద్రావతి సమేత భావనారుషి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు గరుడ సేవ అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సాక్షాత్తు విష్ణు స్వరూపమైన భావన రుషి స్వామి భద్రావతి సమేతగా గరత్మంతుడిపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం పంచామృతాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం వెంట తిరుపతి భక్తబృందం ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ఓబులవారిపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయంపై వెలుగు కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ సిద్దయ్య యాదవ్, ఏవో మల్లిక, ఏపీఎం మల్లికార్జునరాజుల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంలో అవలంబించాల్సిన అంశాలపై శిక్షణ ఇచ్చారు.

వ్యక్తిపై కత్తితో దాడి

సుండుపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత తగాదాలతో మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తిపై ఫారూక్ అనే వ్యక్తి కత్తితో దాడి చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. అనంతరం గాయపడిన వ్యక్తిని ప్రథమ చికిత్స నిమిత్తం రాయచోటికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'కనీస వేతనం ఇవ్వాలి'

రాయచోటిటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు అమలు చేయాలని, మున్సిపల్ వర్కర్స్ న్యాయమైన సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మత్రి సురేశ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. ఈ నెల 20న చేపట్టనున్న సార్వత్రిక సమ్మె నోటీసును వారు మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు.

పాలకొండ్రాయుడికి పలువురు ఘన నివాళులు



ప్రసాద్‌బాబుతో మాట్లాడుతున్న ముక్కా, మృతదేహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు ఎంఎల్ నారాయణ, మాజీ మండల ఉపాధ్యక్షుడు గునిపాటి చెన్నరాయుడు, జనసేనపార్టీ నేత జోగినేని మణి

మాజీ ఎంపీ, ఎమ్మెల్యే, సీనియర్ టీడీపీ నాయకుడు సుగవాసి పాలకొండ్రాయుడు పార్థివదేహానికి పలువురు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుగవాసి బాలసుబ్రమణ్యం, ప్రసాద్‌బాబులను పరామర్శించారు.

ఓబులవారిపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): సుగవాసి పాలకొండ్రాయుడు పార్థివదేహానికి జనసేన నాయకులు నివాళులర్పించారు. అనంతరం చిత్రపటానికి పూలమాల వేసి వేసి సుగవాసి బాలసుబ్రమణ్యం, ప్రసాద్‌లను కలిసి సంతాపాన్ని వ్యక్తం చేశారు. జనసేనపార్టీ రాష్ట్ర నాయకులు జోగినేని మణి, టీడీపీ నేతలు ఎంఎల్ నారాయణ, మాజీ మండల ఉపాధ్యక్షుడు గునిపాటి చెన్నరాయుడు, తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

రైల్వేకోడూరు: ప్రజల కోపం మాజీ ఎంపీ, ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు పాటుపడ్డారని టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. బుధవారం రాయచోటిలో సుగవాసి పాలకొండ్రాయుడు మృతదేహం వద్ద నివాళి అర్పించి ఆయన కుమారులు సుగవాసి బాలసుబ్రహ్మణ్యం, సుగవాసి ప్రసాద్‌బాబులను పరామర్శించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, జోగినేని మణి, గునిపాటి రాయుడు, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: ప్రజా నాయకుడు పాలకొండ్రాయుడు అని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వారి మృతి పట్ల సంతాపం తెలిపి వారి కుమారులు సుగవాసి బాలసుబ్రమణ్యం, సుగవాసి ప్రసాద్‌బాబులను పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, కౌన్సిలర్లు కొలిమి చాన్‌బాషా, ఫయాజ్ అహమ్మద్, సుగవాసి శ్యామ్, జానం రవీంద్రయాదవ్, అస్రఫ్, సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, సాదక్‌అలీ, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు బుజ్జిబాబు, ఇంతియాజ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

రాజంపేటటౌన్: రాజంపేట - రాయచోటి నియోజకవర్గాల ప్రజలతో బలమైన సత్సంబంధాలు కలిగిన నేత, ప్రజా నాయకుడు రాజంపేట మాజీ ఎంపీ, రాయచోటి మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు అని కువైట్ ఎన్నారై టీడీపీ యువ నాయకుడు కంచన రెడ్డిశేఖర్ అన్నారు. బుధవారం కువైట్‌లోని హవల్లి ప్రాంతంలో ఆయన మృతికి సంతాపాన్ని తెలియజేస్తూ సుగవాసి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్నారై టీడీపీ నాయకులు కంచన రెడ్డిశేఖర్, సహదేవా, నాగేష్, సాయిబాబా, బలిజపల్లి సేవా సంఘం అధ్యక్షుడు రాజు, శ్రీహరినాయుడు, గోళ్ల గురుమూర్తి నాయకుడు, నాగరాజు, మల్లికార్జున, బలరాం, మధుసూదన్ పాల్గొన్నారు.

సిద్దవటం: ఆదర్శ నాయకుడు సుగవాసి పాలకొండ్రాయుడు అని జనసేన పార్టీ రాజంపేట సమన్వయకర్త అతికారి కృష్ణ అన్నారు. బుధవారం ఆయన రాయచోటిలో పాలకొండ్రాయుడి భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఆయన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరి వెంకటసుబ్బయ్య, కూటమి నేతలు పాల్గొని ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

నందలూరు: టీడీపీ సీనియర్ నాయకుడు సుగవాసి పాలకొండ్రాయుడు మృతి విషయం తెలుసుకున్న నందలూరుకు చెందిన ప్రముఖ సినీ దర్శకుడు తోట వేణుగోపాల్ బుధవారం మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం వారి కుమారులు సుగవాసి బాలసుబ్రమణ్యం, సుగవాసి ప్రసాద్‌లను పరామర్శించారు.

లక్కిరెడ్డిపల్లె: ఐదు దశాబ్దాలుగా ఎంపీ, ఎమ్మెల్యేగా రాయచోటి నియోజకవర్గం ఐదు దశాబ్దాలుగా పాలించిన సీనియర్ నాయకుడు సుగవాసి పాలకొండ్రాయుడు మరణం రాయచోటి ప్రజలకు తీరని లోటని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా నాయకుడు ఎం.అంకన్న పేర్కొన్నారు. బుధవారం పాలకొండ్రాయుడు పార్థివదేహానికి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.

గాలివానకు భారీ నష్టం



కూకటివేళ్లతో సహా కూలిపోయిన వందేళ్ల చింతచెట్టు

పెనగలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో వీచిన గాలులు, భారీ వర్షానికి కొన్ని ప్రాంతాల్లో భారీ నష్టం జరిగింది. సుడిగాలులు ఒకవైపు నుంచి ఇంకోవైపునకు ఒకేతరహాలో వీచడం వల్ల ఆయా ప్రాంతాల్లో మాత్రమే భారీనష్టం సంభవించింది. పెనుగాలులకు వందల ఏళ్ల వయస్సు కలిగిన చింతచెట్లు, వేప చెట్లు నేలకొరిగాయి. అలాగే మామిడి, వేప తదితర చెట్లు కూడా కొమ్మలు విరిగిపోయి కాయలు రాలిపోయాయి. భారీ వర్షం ప్రారంభమైనప్పుడు విద్యుత్ సరఫరా పూర్తిగా ఆగిపోయింది. బుధవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెనగలూరు, కోడిచెన్నయ్యగారిపల్లె, పల్లంపాడు, ఎంఆర్ పురం, సిద్దవరం, ఓబిలి ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా జరగలేదు. విద్యుత్‌శాఖ సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతులు కార్యక్రమాలు చేస్తున్నారు. పల్లంపాడు గ్రామ పరిధిలో ఐదు విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో ఉదయం నుంచి కరెంటు సరఫరా లేదు. మిగిలిన గ్రామాల్లో అప్పుడప్పుడు కొంతసేపు సరఫరా ఇచ్చి మరమ్మతులు పనుల కారణంగా మరలా తీసివేశారు. పల్లంపాడులో బుధవారం అర్ధరాత్రి వరకు విద్యుత్ సరఫరా లేకపోవడం గమనార్హం. కాగా మండల కేంద్రంలో స్టేట్‌బ్యాంకు దగ్గర ఉన్న వందేళ్ల పైబడిన చింత చెట్టు కూలిపోయింది. అలాగే సాయిబాబా దేవాలయం వద్ద చింతచెట్టు కూడా గాలులకు నేలకొరిగింది. పల్లంపాడు కేసీపల్లె, సిద్దవరం, ఓబిలి ప్రాంతాల్లో కాస్తో కూస్తో కాసిన మామిడికాయలు రాలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

237 ఎకరాల్లో నష్టం

పుల్లంపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో 237 ఎకరాల్లో అరటి పంటకు నష్టం సంభవించింది. మంగళవారం రాత్రి వచ్చిన పెనుగాలులకు అరటి పంట దెబ్బతింది. దీంతో రైతులు రూ.4 కోట్లకు పైగా నష్టపోయారు. మండలంలోని వత్తలూరు, కొమ్మనవారిపల్లె, అనంత సముద్రం, అప్పయ్యరాజుపేట, తిప్పాయపల్లె, రంగంపల్లె, పుల్లంపేట గ్రామాల్లో దెబ్బతింది. తమ సిబ్బంది ప్రాథమిక అంచనా వేస్తున్నారని, నష్టపోయిన రైతుల వివరాలు సేకరించినట్లు వ్యవసాయాధికారి భాస్కర్ తెలిపారు.

మంచినీటి సమస్యపై మండిపాటు

సిద్దవటం, మే 7 (ఆంధ్రజ్యోతి): ఉప్పరపల్లె గ్రామ సచివాలయంలో బుధవారం శాఖరాజుపల్లె గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం ఏర్పాటు చేశారు. బుధవారం ఉప్పరపల్లె గ్రామ సచివాలయంలో సర్పంచ్ లేకపోవడంతో ఉపసర్పంచ్ సుంకే కొండయ్య అధ్యక్షతన ఏపీ పంచాయతీరాజ్ 1994 చట్టం కింద సాధారణ సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో నీటి సమస్య ప్రధానంగా ఉందని పాలకవర్గ సభ్యులు సభ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ.. పంచాయతీలో తాగునీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సమస్యల పరిష్కారం చేయనప్పుడు గ్రామసభలు ఎందుకని మండిపడ్డారు. మండలంలోని శాఖరాజుపల్లె సర్పంచ్ శ్రీకాంత్ ఫిబ్రవరి నెల నుంచి లేకపోవడంతో ప్రజా సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ సెక్రటరి సంధ్యారాణి మాట్లాడుతూ కడప జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మీ ఆదేశాలతో సాధారణ సమావేశం ఏర్పాటు చేశామని, ప్రతి మూడు నెలలకొకసారి గ్రామ సమస్యలపై సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం పంచాయతీల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి సమస్య పరిష్కారం చేస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండయ్య, పాలకవర్గ సభ్యులు క్రిష్ణవేణి, శ్యామల, అయ్యవారయ్య, నాగలక్షుమ్మ, చాముండేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు వర్ధంతి



రాజంపేట, రైల్వేకోడూరులో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

- కమాండెంట్ ఆనంద్‌రెడ్డి

సిద్దవటం, మే 7 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బాకరాపేట సమీపాన ఉన్న 11వ పోలీసు బెటాలియన్‌లో వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి కమాండెంట్ ఆనంద్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రత్యేక అధ్యయం, సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వచ్చిందని నమ్మి అందుకోసం తన ప్రాణాలను అర్పించిన సమరయోధుడు అని కొనియాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ప్రసాద్, కె.వెంకటరెడ్డి, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేట: క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దెపల్లె ప్రతాప్‌రాజు ఆధ్వర్యంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఆర్ అండ్‌బీ వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, పట్టన అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రమణ్యంనాయుడు, మున్సిపల్ కౌన్సిలర్ సుధాకర్, మాజీ కౌన్సిలర్లు గుగ్గిళ్ల చంద్రమౌళి, మనుబోలు వెంకటేశు, మందపల్లి శ్రీనివాసులు, రమణ రాజు, జి.పెంచలరావు, బాలాజి పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: మన్యం వీరుడు, బ్రిటీష్ దొరలకు మట్టికరిపించిన అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు తోట శ్రీనివాసులు మాట్లాడుతూ బ్రిటీష్ దొరలతో వీరోచిత పోరాటాలను మన్యం వీరుడు అల్లూరి చేశారని గుర్తు చేశారు. అలాగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, వైసీపీ వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డిలు నివాళి అర్పించారు. కార్యక్రమంలో విశ్వ హిందూపరిషత్, బీజేపీ నాయకులు మనోహర్ ఆచారి, కాళప్పగారి రాము, చలపతి తదితరులు పాల్గొన్నారు.

విపత్కర పరిస్థితుల్లో రక్షణ కోసమే మాక్ డ్రిల్

- ఆర్డీవో శ్రీనివాసులు, సీఐ కొండారెడ్డి



తూముకుంట సోలార్‌లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

గాలివీడు, మే 7 (ఆంధ్రజ్యోతి): విపత్కర పరిస్థితుల్లో తమతో పాటు తోటి వారిని రక్షించడం కోసమే మాక్ డ్రిల్ నిర్వహించినట్లు రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు, లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి పేర్కొన్నారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని తూముకుంట గ్రామం సోలార్ పవర్ ప్లాంట్‌లో అగ్నిమాపక సిబ్బందితో కలిసి మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల భద్రత, అప్రమత్తత కోసమే ఈ మాక్ డ్రిల్ నిర్వహణ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అంతేగాక తమ చుట్టూ అనుమానాస్పదంగా ఎవరైనా కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గాలివీడు తహసీల్దార్ భాగ్యలత, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి, రవీంద్ర, ఆర్ఐ బాలాజీ, పోలీసు సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి : డీఈ

సుండుపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా 14 గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలం కావడం వలన తాగునీటి సమస్యలు ఏర్పడితే ప్రజలు ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయని, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఏఈ ఇర్ఫాన్‌బాషా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవిమాత వేడుకలు



అమ్మవారికి బంగారు ఆభరణాన్ని అందజేస్తున్న దృశ్యం

నందలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన వాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో వైశాఖ శుద్ధ దశమి బుధవారం వాసవిమాత జన్మదిన వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం మూల విరాట్‌కు ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం రాజంపేట వాసులు యంబలూరు లక్ష్మీనారాయణ, అమృతమ్మలు రూ.1.16 లక్షల విలువైన బంగారు ఆభరణాన్ని కన్యకాపరమేశ్వరిదేవికి వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసింహరావు, ఆలయ అధ్యక్షుడు నరసింహస్వామి, ఉపాధ్యక్షుడు వెంకటకుమార్, సెక్రటరి గెలివికుమార్, వెంకటకుమార్, నారాయణ, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్థానిక అమ్మవారిశాలలో ఆలయ పురోహితులు బాలగురునాథ్‌శర్మ వేకువజామునే అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మనోహర్‌బాబు, సభ్యులు నరసింహులు, వెంకటసుబ్బయ్య, కిరణ్‌కుమార్, తుమ్మలపెంట శ్రీనివాసులు, హరిక్రిష్ణ, జక్కా హరిక్రిష్ణ, ఉమామహేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా బుధవారం రైల్వేకోడూరులో వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నుంచి మొదటిగా ఆర్యవైశ్య కన్యకలు, మహిళలు కలసి పురవీధుల్లో శిరస్సుపై కలశాలు పెట్టుకుని ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రమేష్, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నాయకులు హరినాథ్, శ్రీధర్, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి : ఎంపీడీవో

ఒంటిమిట్ట, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని అన్నివిధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని నూతన ఎంపీడీవో గౌస్‌బాషా తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈయన అన్నమయ్య జిల్లా రామసముద్రంలో ఏవోగా పనిచేస్తూ పదోన్నతిపై ఒంటిమిట్ట ఎంపీడీవోగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో మండల మైనార్టీ నాయకులు షేక్ అజంతుల్లా, చౌడయ్య మౌలాలి, కట్టా యానాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన వృక్షం

- రాకపోకలకు అంతరాయం



రహదారిపై నేలకొరిగిన చెట్టు

సిద్దవటం, మే 7 (ఆంధ్రజ్యోతి): పెనుగాలులు, ఉరుములతో కూడిన వర్షం కారణంగా ఓ చెట్టు రహదారికి అడ్డంగా పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు, గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని శాఖరాజుపల్లె పంచాయతీ బ్రాహ్మణపల్లె గ్రామం గ్రామీణ రహదారిపై మంగళవారం రాత్రి ఈదురుగాలుల వర్షాల కారణంగా రహదారికి అడ్డంగా వృక్షం నేలకొరగడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా ఇబ్బందికరంగా మారి ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ సెక్రటరి శివ సంధ్యరాణిని వివరణ కోరగా మంగళవారం రాత్రి వర్షాల కారణంగా వృక్షం రహదారికి అడ్డంగా పడిపోయిందని, తొలగింపు పనులు చేస్తామని ఆమె అన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను తీర్చండి : సీఐటీయూ

రాజంపేటటౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్మిక సంఘం నేతలతో కలిసి సీఐటీయూ నేతలు మూడోరోజు నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు పదవీ విరమణ అనంతరం వారి కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, ఏపీఎన్జీవో జేఏసీ చైర్మన్ ఎస్వీ రమణ, ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజనేయులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను నిర్మూలించాలి : బీజేపీ

రాయచోటిటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులను సమూలంగా నిర్మూలించడంలో భాగంగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం హర్షించదగ్గ విషయమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ కుమార్‌రాజు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భారతదేశ త్రివిధ దళాలు ఎలాంటి సైనిక చర్యలనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాయనే సంకేతాన్ని తీసుకెళ్తూ ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా, రక్షణశాఖ మంత్రి, విదేశాంగశాఖ మంత్రులు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారన్నారు.

ఇత్తడి సర్వాంగాలు బహూకరణ

సిద్దవటం, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భద్రావతి బావనారాయణ, వేంకటేశ్వరస్వాముల మూలమూర్తులకు గ్రామానికి చెందిన అవ్వారు రవిశంకర్, బాబురావు సోదరులు ఇత్తడి సర్వాంగాలు తొడుగులు, కిరీటాలు బహూకరించారు. మండలంలోని మాధవరం-1 గ్రామంలో వెలసిన శ్రీభద్రావతి భావనారాయణ సమేత సీతారాముల దేవస్థానంలో 28వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా దాదాపు రూ.60 వేలు విలువైనవి అందజేశారు.

ఘనంగా ద్రౌపతీ కల్యాణం

రామాపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక హరిహరాలయం సమీపంలో మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం ద్రౌపతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా హరికథ కథానాయుని గీతావాణి ద్రౌపతి కల్యాణం అంగరంగ వైభవంగా హరికథ రూపంలో నిర్వహించారు. ద్రౌపతి మాత తరఫున మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, పాండవుల తరఫున నెర్సుపల్లి వెంకట్రామిరెడ్డిలు ఇరువైపులా వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణం భక్తుల సమక్షంలో నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి మహిళలు, ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

కొత్తరేషన్ కార్డుల జారీకి ఏర్పాట్లు పూర్తి

రాజంపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజంపేట మండలంలో కొత్తరేషన్ కార్డులను జారీ చేయడానికి తక్షణ చర్యలు తీసుకున్నట్లు తహసీల్దారు పీర్ మున్నీ ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ 7వ తేదీ నుంచే ప్రారంభమైందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గాలివాన బీభత్సం

● నేలకొరిగిన అరటి ● కల్లాల్లోనే తడిచిన వరి ధాన్యం ● రైతుల ఆశలు ఆవిరి



ఈదురుగాలులకు ఒంటిమిట్టలో నేలకొరిగిన అరటి తోట

ఓబులవారిపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి) : మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సానికి వందలాది ఎకరాల్లో పంటలు నాశనమై కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో 112 మంది రైతులకు సంబంధించి సుమారు 177 ఎకరాల్లో అరటి పంటకు నష్టం జరిగిందని హార్టికల్చర్ అధికారులు అంచనా వేశారు. ఇవే కాకుండా స్వల్ప మోతాదుల్లో దెబ్బతిన్న వాటిని లెక్కచేయకపోవడం వల్ల చాలా మంది రైతులు నష్టాలపాలయ్యారు. చిన్నఓరంపాడు, పెద్దఓరంపాడు, ముక్కావారిపల్లె, గాదెల, వై.కోట, బాలిరెడ్డిపల్లె, చిన్నంపల్లె వంటి గ్రామ పంచాయతీల్లో అరటి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక రైతు సుమారు 4 ఎకరాల సాగుకు ఐదు లక్షలకు పైబడే ఖర్చు చేసినట్లు తెలిపారు. అయితే పంట చేతికొచ్చే సమయానికి గాలివాన నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా మానసికంగా ఇబ్బందులకు గురైన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. ఓబులవారిపల్లె గ్రామ పంచాయతీలో పిడుగుపాటుకు ఓబిలి శ్రీనివాసులరెడ్డి ఇంటిలో విద్యుత్ సామగ్రితో పాటు గ్రామంలోని సుమారు 20 ఇళ్లల్లో ఫ్రిజ్‌లు, టీవీలు, కరెంటు పరికరాలు కాలిపోయాయని తెలిపారు.

ఒంటిమిట్టలో...

ఒంటిమిట్ట, మే 7 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలో గాలివాన బీభత్సం సృష్టించింది. బుధవారం తెల్లవారుజామున 2.30 నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో అరటి రైతు కుదేలయ్యాడు. ఒంటిమిట్టలో ఉదయం 7 గంటల వరకు భారీ వర్షం కురిసింది. ఒంటిమిట్ట సమీపంలో రైతులు సుమారు 15 ఎకరాల్లో అరటిపంట సాగు చేశారు. చేతికొచ్చిన పంట ఈదురు గాలులతో కుప్పకూలిపోయింది. దీంతో రైతుల ఆశలు ఆవిరి అయిపోయాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంట చేతికొచ్చే సమయంలో ఇలా జరగడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. ఎకరా అరటి పంట సాగు చేయాలంటే సుమారు లక్ష రూపాయలు ఖర్చు వస్తుందని, వాతావరణం అనుకూలించి పంట చేతికొస్తే ఎకరాకు 2 లక్షల వరకు ఆదాయం వస్తుందని రైతులు తెలిపారు. అలాంటిది అకాల వర్షం కారణంగా తమ పంట నేలకొరిగిపోవడంతో పెట్టుబడి రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. అప్పులు చేసి పంటను సాగు చేస్తే చేతికొచ్చే సమయంలో ఇలా జరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరటి పంటకు నీటికొరత ఏర్పడడంతో నానా తంటాలు పడి నీరు అందించి పంటను సాగు చేస్తే విధి తమతో ఆడుకుందని ఆవేదన చెందారు. మండలంలోని భీమవరం వసుంధర అనే మహిళా రైతు ఆరు ఎకరాల్లో అరటి పంటను సాగు చేశారు. అలాగే నితీశ్వర్‌రెడ్డి అనే రైతు 5 ఎకరాల్లో అరటి పంటను సాగు చేశారు. వీరితో పాటు మరికొందరు రైతులు కూడా అరటి పంటను సాగు చేశారు. ఈదురు గాలులు వర్షంతో తాము తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అప్పుచేసి పంట సాగు చేశాం



చేతిలో డబ్బులు లేకపోయినా అప్పు చేసి అరటి పంటను సాగు చేశాం. చేతికొచ్చే సమయంలో పంట నేలకొరిగిపోవడంతో అప్పు తీర్చలేని పరిస్థితి ఏర్పడింది.

- భీమవరం వసుంధర, రైతు, ఒంటిమిట్ట

ప్రభుత్వం ఆదుకోవాలి



చేతికొచ్చిన పంట నేలపాలు కావడంతో ప్రభుత్వం ఆదుకోవాలి. ఎంతో కష్టపడి ఐదెకరాల్లో పంటను సాగు చేశాను. అకాల వర్షంతో కోలుకోలేని దెబ్బ తగిలింది.

- నితీశ్వర్‌రెడ్డి, రైతు, ఒంటిమిట్ట





సీహో కమ్మపల్లెలో దెబ్బతిన్న అరటి తోట వద్ద రైతు మాడపూరు సుబ్రమణ్యంనాయుడు, దెబ్బతిన్న అరటి తోటను చూపుతున్న రైతు వేమన రవీంద్రనాయుడు

కల్లాల్లోనే తడిచిన వరి ధాన్యం

చెన్నూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో అకాల వర్షంతో రైతులు అవస్థలు పడ్డారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత కురిసిన వర్షం వరి కోత రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. రెండు రోజుల నుంచి వరి కోతలు చేపట్టిన రైతులు కల్లాల్లోనే ధాన్యం ఆరబెట్టుకోగా మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత కురిసిన భారీ వర్షంతో కల్లాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం మొత్తం తడిసిపోయింది. దీంతో ఆ రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. రబీ సీజనులో వేసవిలో కోతకు వచ్చే విధంగా వరి సాగు చేపట్టిన రైతులు కాసింత ఆలస్యంగానే వరి సాగు చేపట్టారు. కాగా చాలా వరకు ఏప్రిల్ 15 నాటికి వరి కోతలు పూర్తయ్యాయి. అంతో ఇంతో మిగలిన రైతులు గత వారం రోజులుగా వరి కోతలు చేపట్టారు. సోమ, మంగళవారాల్లో వరిని కోస్తున్న రైతులకు అనుకోకుండా వచ్చిన వర్షం పెద్ద దెబ్బతీసింది. మండలంలోని బుడ్డాయపల్లెకు చెందిన శ్రీనివాసులరెడ్డి, ఉమాదేవి, పరమేశ్వర్‌రెడ్డి, ఇలా మరి కొంతమంది రైతుల ధాన్యం కల్లంలో తడవడంతో ఆరబెట్టి అమ్ముకోవాలన్నా ఇంట్లో వేసుకోవాలన్నా నష్టపోతామని ఆవేదన చెందుతున్నారు. పైగా ప్రభుత్వం కూడా ప్రస్తుతం ధాన్యాన్ని ముఖ్యంగా జిల్లా ప్రాంతంలో కొనుగోలు చేసేందుకు సుముఖత వ్యక్తం చేయకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందేమోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బుడ్డాయపల్లె వద్ద వరిపొలాల్లో తడిచిన ధాన్యం



రోడ్డుపై ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు

పౌరుల బాధ్యతే ముఖ్యం

● ఏపీఎండీసీలో మాక్ డ్రిల్



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఓబులవారిపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): భారతదేశం- పాకిస్థాన్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణంలో విపత్కర పరిస్థితుల్లో ప్రజలను రక్షించుకునేందుకు కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ఏపీఎండీసీ మంగంపేటలో సంక్షోభం సమయంలో ప్రాణాలు ఎలా కాపాడుకోవాలి అన్న అంశాలపై అవగాహన కల్పించారు. అందులో భాగంగా సీపీఆర్ అందించడం, గాయాలపాలైన వారిని ఆసుపత్రికి తరలించడం, అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఫైర్‌శాఖ వారిని సంప్రదించి ప్రమాదాల నుంచి రక్షణ పొందడం వంటి వాటిని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అలాగే పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్‌రావు, సీపీవో సుదర్శన్‌రెడ్డి, మైన్స్ మేనేజర్ గోపినాథ్, ఎస్ఐ మహేష్, ఎస్పీఎఫ్ ఎస్ఐ శివ, సిబ్బంది, కోడూరు ఫైర్ సేఫ్టీ అధికారులు, సిబ్బంది త్రివేణి జీఎం, డిప్యూటీ మేనేజర్ చలపతిరెడ్డి, హెచ్ఆర్‌డీ నారాయణరెడ్డి, ఏపీఎండీసీ ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

రైతు ఫిర్యాదుతో జేసీ పర్యటన



రైతు షెడ్డును పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

సిద్దవటం, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుమలోపల్లె రెవెన్యూ పొలం గ్రామానికి చెందిన రైతు శివకుమార్ ఫిర్యాదుతో కడప జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ బుధవారం కనుమలోపల్లె గ్రామంలో పర్యటించారు. నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా రైతు శివకుమార్ రేకుల షెడ్డు నిర్మాణానికి నష్టపరిహారం కింద డబ్బులు తక్కువ ఇచ్చారని జేసీకి ఫిర్యాదు చేయడంతో విచారణ నిమిత్తం ఆమె పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం కడప-చెన్నై జాతీయ రహదారి పక్కనున్న జేఎంజే కళాశాల వద్ద పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంతాలను పరిశీలించారు. మండలంలో ప్రజల సమస్యలు పరిష్కరించాలని జేసీ సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో జాన్ ఇర్విన్, ఇన్‌చార్జి మండల తహసీల్దారు మాధవీలత, ఆర్అండ్‌బీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో బెల్టు షాపులు...!

మహిళల పట్ల మందుబాబుల అసభ్య ప్రవర్తన

గుర్రంకొండ, మే 7 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ ఇందిరమ్మకాలనీలో బెల్టుషాపుల జోరుతో మద్యం వ్యాపారం మూడు పువ్వులు..ఆరు కాయలుగా సాగుతోంది. ఇందిరమ్మ కాలనీ, ఎన్టీఆర్ కాలనీలో సుమారు 700 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ కాలనీలో కొన్ని నెలలుగా మద్యం వ్యాపారం జోరుగా జరుగుతోంది. ఇందులో భాగంగా కాలనీలో ఆరు బెల్టు షాపులను అక్రమంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఈ బెల్టుషాపుల్లో వేలాది రూపాయల మద్యం వ్యాపారం చేస్తున్నారు. బెల్టుషాపు నిర్వాహకులు ఉదయం 6 గంటల నుంచే మద్యంను విక్రయిస్తున్నారు. దీంతో మద్యం కోసం మందుబాబులు తెల్లారకనే బెల్టు షాపుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మద్యం తాగి వీధుల్లో తూలుతూ ఎక్కడపడితే అక్కడ పడిపోతున్నారు. అంతే కాకుండా వీధుల్లో ఉండే మహిళలపై మందుబాబులు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు మహిళలు వాపోతున్నారు. బెల్టుషాపుల నిర్వహణపై ఎక్సైజ్, పోలీసులకు తెలిపినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై వాల్మీకీపురం ఎక్సైజ్ సీఐ లత వివరణ కోరగా ఇందిరమ్మ కాలనీలో బెల్టు షాపులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. బెల్టుషాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పోక్సో కేసులో కర్ణాటక వాసి అరెస్టు

కలికిరి, మే 7 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసు నిందితుడు కర్ణాటక రాష్ట్రం హసన్ పట్టణానికి చెందిన జె.ఎస్.రాజేశ్ అలియాస్ సునీల్ (24)ను బుధవారం కలికిరి క్రాసు రోడ్డులో అరెస్టు చేసి వాల్మీకిపురం కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ రెడ్డిశేఖరరెడ్డి తెలిపారు.

కలికిరి పట్టణంలో బేకరీ నిర్వహిస్తున్న అతను హసన్ ప్రాంతానికే చెందిన ఓ బాలికను మోసగించడంతో ఆమె ఓ బిడ్డకు జన్మనిచ్చిందన్నారు. ఆ బాలిక ఫిర్యాదు మేరకు హసన్‌లో కేసు నమోదు కాగా, ఆ కేసు కలికిరికి బదిలీ అయ్యిందన్నారు. దీంతో తాము అతడిని బుధవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండు విధించారని సీఐ తెలిపారు.

సౌమ్యనాథస్వామి హుండీ లెక్కింపు

నందలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు సౌమ్యనాథస్వామి హుండీని బుధవారం లెక్కించగా రూ.2,64,921 వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీని నెలరోజుల తర్వాత లెక్కించామన్నారు. వచ్చిన మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి జనార్దన్, భక్తులు పాల్గొన్నారని తెలిపారు.



హుండీ డబ్బును లెక్కిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

కురబలకోట, మే 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం మేరకు... పెద్దమండ్యం మండలం శెట్టివారిపల్లెకు చెందిన వెంకటేష్ కుమారుడు వెంకటరమణ (22) మండలంలోని అంగళ్లు సమీపంలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ చదువుతున్నాడు.

బుధవారం తన స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనంలో కళాశాలకు వెళుతూ ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో కిందపడ్డాడు. అదే సమయంలో ఆ మార్గాన వెళుతున్న ట్రాక్టర్ అతడిపై దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ ప్రమాదంలో గాయపడ్డ మరో విద్యార్థి శశిధర్ మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

నేను విజిలెన్స్ డీఎస్పీని..సస్పెండ్ చేస్తా జాగ్రత్త..!

● మీ అక్రమాలు చాలానే ఉన్నాయి..సర్దుకోండి
● ట్రాన్స్‌కో అధికారులకు అజ్ఞాత వ్యక్తి ఫోన్
● ఫోన్‌లో బెదిరింపు...రూ.లక్ష ట్రాన్స్‌ఫర్
● మోసపోయిన బాధితులు..ఫిర్యాదుకు ససేమిరా
● విజిలెన్స్, ఏసీబీ, సీఐడీ పేరుతో మోసాలు



మదనపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): మోసపోయే వాళ్లు ఉన్నంత వరకు మోసం చేసే వాళ్లు పుట్టుకొస్తూనే ఉంటారు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ క్రైం నేరగాళ్లు కూడా పెరిగిపోతున్నారు. ఇందుకు ఫోన్లలో మెసేజ్ లింకులు, డైరెక్ట్‌గా ఫోన్‌కాల్స్, వీడియో కాల్స్ ఇలా...వివిధ రూపాల్లో విజిలెన్స్, ఏసీబీ, సీబీఐ అధికారులం అంటూ బ్లాక్‌మెయిల్, బెదిరింపులకు పాల్పడుతూ అటు ప్రజలు, ఇటు అధికారులను మోసం చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇందులో అక్షరజ్ఞానం లేని సామాన్యుడి నుంచి నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉన్నతాధికారులు కూడా బలవుతున్నారు. కొందరు పోలీసులను ఆశ్రయిస్తుండగా మరికొందరేమో ఎటూ మోసపోయాం..నష్టపోయాం బయటకు తెలిస్తే పరువుపోతుందని బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇలాంటి సంఘటనలు, ఉదంతాల నుంచి అప్రమత్తం చేసే క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నాయి. చివరకు ఫోన్ డయిలింగ్‌లోనూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌ల నుంచి జాగ్రత్తగా ఉండాలని, అనుమానం వస్తే సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నెంబర్-1930 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. అయినా చాలామంది వీటిని పెడచెవిన పెడుతున్నారు. అజ్ఞాత వ్యక్తుల మాటలు విని, బెదిరింపులకు భయపడి తీవ్రంగా నష్టపోతున్నారు. ఇందుకు నిదర్శనమే..జిల్లాలోని మదనపల్లె డివిజన్‌లో తాజాగా జరిగిన సంఘటనలివీ.

మదనపల్లె మండలం సీటీఎం ఏరియాలోని ఇద్దరు ట్రాన్స్‌కో అధికారులు అజ్ఞాత వ్యక్తుల చేతిలో తీవ్రంగా నష్టపోయారు. వారం రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ట్రాన్స్‌కోలోనే కాదు స్థానికంగా తీవ్రమైన చర్చ నడుస్తోంది. మదనపల్లె-తిరుపతి ప్రధాన రహదారి వెంట ఇటీవల రోడ్డు విస్తరణ పనులు, సీటీఎంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇక్కడ విద్యుత్తు శాఖ, జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో విద్యుత్తు స్తంభాలు, లైన్ల మార్పుతో పాటు కొత్తగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ముసుగులో సమీపంలోని రైతులు, ప్రైవేటు వ్యక్తుల భూములు, స్థలాల్లో ఉన్న వాటిని అనధికారికంగా మార్పు చేసినట్లు చెబుతున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో వివరాలు రాబట్టిన అజ్ఞాత వ్యక్తి తాను విజిలెన్స్ డీఎస్పీని అంటూ ట్రాన్స్‌కో అధికారికి ఫోన్ చేసి బెదిరించాడు. విద్యుత్తు పనుల్లో అక్రమాలకు పాల్పడ్డారని, తన వద్ద ఆధారాలు ఉన్నాయని..ఒకటి, రెండు అంశాలను ఫోన్‌లో వివరించినట్లు తెలిసింది. మీపై చర్యలు తీసుకుంటామని, సస్పెండ్ చేస్తామని బెదరింపు ధోరణితో హెచ్చరించినట్లు సమాచారం. దీంతో బయపడిన ఆ అధికారి వెంటనే తన కిందస్థాయి అధికారిని లైన్‌లోకి తీసుకుని మాట్లాడమని చెప్పారు. ఆ అజ్ఞాత వ్యక్తి ఇదే స్థాయిలో వివరాలు చెప్పి బెదిరించడంతో ఆయన కూడా కాస్త మెత్తబడ్డారు. సార్ అలా చేయొద్దని, తాను మీతో మాట్లాడుతానని చెప్పడంతో ఫోన్‌పేలో డబ్బులు వేయమని లైన్‌లో ఫోన్‌లో మాట్లాడుతుండగానే, మరో నెంబరు ఇచ్చి డబ్బులు వేయమన్నాడు. అంతే ట్రాన్స్‌కో కిందిస్థాయి అధికారి వెంటనే లక్ష రూపాయలు అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన ఫోన్ నెంబర్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. తర్వాత సీన్ కట్ చేస్తే..అతనెవరో తెలీదు. ఫోన్ నెంబర్లు పనిచేయడం లేదు. చివరకు మోసపోయామని తెలుసుకున్న ఇద్దరు ట్రాన్స్‌కో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో ఉన్నతాధికారి దృష్టికి తెస్తే..విషయం బహిర్గతం కాకుండా, చేయకుండా సర్దుబాటు చేశారు. మోసపోయామని తెలుసుకున్న వారిద్దరూ..పోయిన డబ్బుల కోసం పంచాయితీ పెట్టారు. నాపై అధికారి చెబితే సమస్య లేకుండా మ్యానేజ్ చేశానని బాధితుడు..కాదు మాట్లాడమని మాత్రమే తాను చెప్పానని, ఒకేసారి డబ్బులు చెల్లించమని చెప్పలేదని ఆ అధికారి వాదించుకుంటున్నారు. ఈ విషయం సహచరుల దృష్టికెళ్లగా, ఫోన్ నెంబర్ల ఆధారంగా ఫిర్యాదు చేద్దామంటే వద్దంటున్నారు. ఇద్దరు బాధితుల్లో ఒకరు వచ్చే నెలలో పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఫిర్యాదులు, కేసులు ఎందుకని, ఇన్నాళ్ల సర్వీసులో ఎప్పుడూ ఇలాంటి సంఘటన జరగలేదని, ప్రశాంతంగా ఇంటికెళ్లిపోతే పోతుందిలే అన్నట్లు ఉండిపోయారు.

● నేను ఏసీబీ అధికారి కసిరెడ్డిని మాట్లాడుతున్నా..నీపై దగ్గర్లోనే రైడ్ చేస్తున్నాం..అరెస్టు చేస్తున్నానమంటూ గత ఏడాది నవంబరు 7వ తేదీ మదనపల్లెలోని ట్రాన్స్‌కో అధికారి ఫోన్ చేశాడు. నిన్ను లోపల వేశాకే తెలుస్తుంది..అరెస్టు చేశాక నీకు అర్థమవుతుంది..మా వాళ్లంతా బయలుదేరుతున్నారు.. హైదరాబాద్ నుంచి అంటూ వీడియో కాల్‌లో కార్యాలయాన్ని చూపించాడు. ఏదో చూడంటి సార్..అంతా మీ చేతుల్లోనే ఉంది.. మీరే కాపాడాలని ఆయన అతడిని ఫోన్‌లో వేడుకున్నాడు. ఫోన్‌లైన్‌లో మాట్లాడుతూనే, అంతలో ఫోన్‌పే నెంబరు ఇచ్చి డబ్బులు వేయమని సూచించాడు. ఆ నెంబరు తీసుకుని సర్, మీరెక్కడున్నారు.. నేను పర్సనల్‌గా మీతో మాట్లాడాలని బాధితుడు చెప్పాడు. ఇది హైదరాబాద్ అని చెప్పడంతో బాధితునికి కాస్త ధైర్యం వచ్చి..తిరిగి అతడితో మాట్లాడారు. మీరు ఇందాక వీడియోకాల్‌లో చూపించిన కార్యాలయం ఎక్కడ సార్ అని ఆరా తీయగా, ఇది హైదరాబాద్ ఏసీబీ కార్యాలయం అని సమాధానం రావడంతో బాధితుడు మరింత ధైర్యం తెచ్చుకుని ఎదురుతిరిగాడు. నేను ఉద్యోగం చేస్తున్నది ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా తిరుపతి సర్కిల్‌లో తెలంగాణాకు, ఏపీకి సంబంధం ఏంటని బాధితుడు ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఇతను కూడా బెదిరింపు ధోరణితో మాట్లాడటంతో కాల్ కట్ చేసేశాడు. భయపడకుండా ధైర్యంగా ప్రశ్నించడంతో ఆయన మోసం నుంచి తప్పించుకున్నాడు.

● బి.కొత్తకోటకు చెందిన మరో ట్రాన్స్‌కో అధికారికి ఈ ఏడాది జనవరిలో విజిలెన్స్ ఎస్పీని అంటూ ఫోన్ వచ్చింది. వెంటనే నీవు నాకు లక్ష రూపాయలు ట్రాన్స్‌ఫర్ చేయాలని లేకుంటే వెంటనే సస్పెండ్ చేస్తానని బెదిరించాడు. దీంతో భయపడిపోయిన ఆయన రెండురోజులు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. దీంతో అజ్ఞాత వ్యక్తి మోసం నుంచి బయటపడ్డాడు. తీరా చూస్తే..తర్వాత అలాంటిదేమీ జరగకపోవడంతో మోసం నుంచి గట్టెక్కానని బాధితుడు ఊపిరి పీల్చుకున్నాడు. ఇలా వరుసగా విద్యుత్తు శాఖ అధికారులు, సిబ్బందికే బెదిరింపు కాల్స్ రావడంపై ఆ శాఖాధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వివాదాస్పద నిర్మాణాలపై

ఏఎస్పీ విచారణ



నిర్మాణాలపై విచారణ చేస్తున్న ఏఎస్పీ మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే

రాజంపేటటౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణం డీబీఎన్‌పల్లె అరుంధతివాడ చుట్టూ కొందరు ఏర్పాటు చేసుకున్న గోడ నిర్మాణాలను బుధవారం ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే పరిశీలించి విచారణ చేశారు. ఈ నిర్మాణాలపై కొందరు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ విచారణ చేపట్టారు. ఎగువ అరుంధతివాడ, దిగువ అరుంధతివాడ ప్రజలతో మాట్లాడారు.

అగ్రవర్ణాల వారు వివక్షతో తమ గ్రామం చుట్టూ ఎత్తయిన గోడలు నిర్మించి తమను సామాజిక బహిష్కరణకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అంటరానితనంతో కుల వివక్షతతో తమ గ్రామం చుట్టూ ఎత్తయిన గోడలు నిర్మించడం దారుణమన్నారు. వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన పూర్వాపరాలను ఉన్నతాధికారులకు తెలియజేసి చర్యలు తీసుకుంటామని వారికి ఏఎస్పీ హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

ఓబులవారిపల్లె, మే 7 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారి మంగంపేట పరిసరాల్లో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొని పలువురికి గాయాలయ్యాయని ఎస్ఐ మహేష్ తెలిపారు. రైల్వేకోడూరు నుంచి రాజంపేట వైపు వెళుతున్న స్కార్పియో వాహనం, ఓబులవారిపల్లె నుంచి రైల్వేకోడూరుకు వెళుతున్న ఆటో ప్రమాదవశాత్తు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఇరువాహనాల డ్రైవర్లు సుభాన్, అజయ్ కాగా మరొక వ్యక్తికి గాయాలు కావడంతో 108 ద్వారా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెన్నా తీరంలో... ప్రమాద ఘంటికలు

- కరకట్టలు లేకపోతే...వరదనీటితో ముప్పు
- ఏటా కోతకు గురవుతున్న నదీ తీరం
- ఆందోళనలో పరివాహక గ్రామాల ప్రజలు


చెన్నూరు వద్ద వంతెన వైపు కోతకు గురైన పెన్నాతీరం

పెన్నాతీర ప్రాంతం ఏటా కోతకు గురవుతోంది. 50 ఏళ్ల నాడు నిర్మించిన కరకట్టలు దాదాపు దెబ్బతినడంతో వరద నీరు వచ్చినప్పుడల్లా నీటి ఉధృతికి పెన్నా తీరం క్రమేపీ కోతకు గురవుతోంది. వర్షాకాలంలో నదిలో నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నపుడు నదీ పరివాహక గ్రామాల ప్రజలు ఎప్పు డు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వెంటనే నదికి ఇరువైపులా రాతి కరకట్టలు నిర్మించి ప్రాణ, ఆస్థి నష్టం జరగకుండా కాపాడాలని పరివాహక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చెన్నూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు మండలంలోని పెన్నాతీరం ప్రాంతంలో గల గ్రామాలన్నింటికీ ఆదే పరిస్థితి ఉంది. ప్రతి ఏటా వర్షాకాలంలో కుందూ, పాపాఘ్ని నదుల నుంచి వరద నీరు వచ్చి పెన్నానదిలో కలిస్తే నీటి ఉధృతి ఎక్కువగా ఉంటుంది. దాదాపు 25 అడుగుల మేర.. లక్ష క్యూసెక్కుల పైన వరద నీరు పెన్నానది నుంచి ప్రవహిస్తూ సోమశిల వైపు దూసుకెళుతుంది. ఇలా దాదాపు 70, 80 ఏళ్లుగా వరదనీరు ప్రవహిస్తుండడంతో పెన్నా తీరమంతా క్రమేపీ కోతకు గురైంది. గతంలో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా... తీరం వెంబడి రాతికట్టడం కట్టాలన్నా, కరకట్టలు నిర్మించాలని కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుందని.. నీటి పారుదల, పంచా యతీ రాజ్‌శాఖ అధికారులు చేతులెత్తేశారు.

50 ఏళ్ల క్రితం కట్టిన కరకట్టలే

పెన్నానదిలో ప్రవహించే వరద నీటి ఉధృతికి తీరం కోతకు గురికాకుండా.. 1975 ప్రాంతంలో చెన్నూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ వీటీ వీరారెడ్డి రాష్ట్రస్థాయి అధికారులను ఒప్పించి నది లో తొమ్మిది చోట్ల కరకట్టలు ఏర్పాటు చేశారు. కొక్కిరాయపల్లె నుంచి చెన్నూరు గ్రామ పంచా యతీ చివరి వరకు నదిలోకి సుమారు 10 నుంచి 12 అడుగుల మేర కరకట్టలు నిర్మించారు. దీంతో నదిలో నీరు ఎంత ఉధృతంగా ప్రవహించినా నీరు తీరం వైపు రాకుండా నదిలో ప్రవహించేది. పాతికేళ్ల వరకు ఇబ్బంది లేకుండా ఉండేది. ఏటా వరద నీటి ఉధృతికి కరకట్టలు క్రమేపీ దెబ్బతింటూ వచ్చాయి. దీంతో వరద నీరు ఎక్కువగా వచ్చినప్పుడు కరకట్టలపై పొంగి ప్రవహిస్తూ తీర ప్రాంతం కోతకు గురై.. వరద నీటిలో వచ్చే విషసర్పాలు తీర ప్రాంత ఇళ్లల్లోకి వస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి నదీ తీరం వెంబడి దెబ్బతిన్న కరక ట్టలను పునఃనిర్మించాలని పరివాహక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


చెన్నూరు వనం వీధికి కింది భాగంలో కోతకు గురైన పెన్నాతీరం

గతంలో రూ.10లక్షలు మాత్రమే నిధులు మంజూరు

పెన్నాతీరం కోతకు గురవుతుందని 23 ఏళ్ల క్రితం అప్పటి ఉప మండలాధ్యక్షురాలు ఈ విషయాన్ని అప్పట్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. రూ.10 లక్షలు మాత్రం మంజూరు చేశారు. దీంతో చెన్నూరు కొండపేట వంతెన మొదట్లో మైనార్టీ కాలనీ వైపు ఏటి వెంబడి కొంత వరకు గోడ నిర్మించారు. ఆ తరువాత ఒక్కపైసా కూడా నిధులు మంజూరు కాలేదు. దాదాపు 30 ఏళ్లుగా ప్రజలు పెన్నాతీరం కోతకు గురవుతుందని నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

వానా కాలం వస్తే భయమేస్తుంది



వానాకాలం వస్తే.. వరద నీటి ఉధృతి చూస్తే భయం వేస్తుంది. నదిలో నీళ్లు ఊరిపైకి వస్తాయేనోనని టెన్షన్‌గా ఉంటుం ది. ఏటికి ఇరువైపులా మట్టికట్ట అంతా కోసుకుపోయింది. దీంతో ఏటిలో పూడ్చేం దుకు శవాలు తీసుకెళ్లాలన్నా దారి లేకుండా పోయింది. అంతకు ముందు పోయే దారి వరద నీటి ఉధృతికి కోతకు గురైంది. అధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి రాతికట్టలు కట్టాలి.

- కుందేటి క్రిష్ణయ్య, వనంవీధి, చెన్నూరు

నదికి రెండు వైపులా రాతి కట్టలు కట్టాలి



రెండేళ్లక్రితం పెన్నానదికి ఉధృతంగా ప్రవహించడంతో చెన్నూరు వైపు ఇళ్లలోకి నీళ్లు వచ్చాయి. కొండపేట వైపు చాలా వరకు కోతకు గురైంది. వరద నీటి ఉధృతి తట్టుకోవాలంటే నదికి ఇరు వైపులా మట్టి కోతకు గురికా కుండా రాతికట్టలు కట్టాలి. 25 ఏళ్ల క్రితం కొద్దిగా నిధులు వచ్చాయి. ఇళ్లు, భూములు వరద నీటితో దెబ్బతిన కుండా కరకట్టలు నిర్మించాలి.

- ఎం.మోహన్‌రెడ్డి,. మాజీ సర్పంచ్, కొండ పేట

ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్త... ప్రభుత్వ ధ్యేయం


కొప్పర్తిలో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి తదితరులు

సీకేదిన్నె, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. అందులో భాగంగా కొప్పర్తి పారిశ్రామికవాడలో ఎంఎస్ఎంఈ ప్రాజెక్టు ద్వారా పరిశ్రమలను స్థాపించడానికి బుధవారం శంకుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికంగా అభివృద్ధి చెంది వారు ఉపాధి పొందడంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ప్రభుత్వం భారీ పెట్టుబడులు పెట్టలేని వారి కోసం చిన్న చిన్న వ్యాపారాలను ప్రోత్సహించేందుకు కూడా ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఇతర రాష్ట్రాలకు పోయి వ్యాపారాలు పెట్టే బదులు స్థానికంగా ఉండే అవకాశాలను ఉపయోగించుకుని పరిశ్రమలు పెడితే ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహకం అందిస్తుందన్నారు. కొప్పర్తిని ప్రజా ఇండ్రస్ట్రియల్‌పార్కు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇప్పటికే కొన్ని పరిశ్రమలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొప్పర్తిలో రైల్వేలు, రోడ్డుమార్గం, విమాన మార్గాలు అందుబాటులో ఉండడంతోపాటు నీటి సౌకర్యం కూడా పుష్కలంగా ఉందని, ఈ అవకాశాలను యువపారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోగటం సుజాత, నేతలు కృష్ణారెడ్డి, మోహన్‌బాబు, జనార్ధన్‌రెడ్డి, శ్రీను, ఓబుళరెడ్డి, మహేష్, నజీర్, వీరకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీ సీఈగా వాసుదేవరావు

ఎర్రగుంట్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎంవీఆర్ఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌గా జి.వాసుదేవరావు నియమితులయ్యారు. ఆయన లోయర్ సీలేరు హైడల్ పవర్ స్టేషన్ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వస్తున్నారు. అలాగే ఇక్కడ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న గౌరీపతి విద్యుత్ సౌదలో చీఫ్ జనరల్ మేనేజర్ అడ్మినిస్ట్రేషన్‌గా బదిలీపై వెళుతున్నారు. ఆయన బుధవారం రాత్రే ఆర్టీపీపీ నుంచి రిలీవ్ అయ్యి గురువారం విద్యుత్ సౌదలో రిపోర్టు చేయనున్నట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతి చెందిన ధర్మారావు (ఫైల్)

లింగాల, మే 7 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పార్నపల్లెకు చెందిన పాముల ధర్మారావు (25) ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఎస్ఐ మధుసూదన్‌రావు కథనం మేరకు వివరాలిలా.. ధర్మారావు తన తండ్రి ఎరికలప్పతో కలిసి మంగళవారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లారు. వరిపంట కోత కోయించారు. పశువులు పొలంలోకి వస్తాయని భావించి ఎరికలప్ప కుమారునితో విద్యుత్ వెర్లను తీసివేసి ఇంటికి రమ్మని వెళ్లిపోయాడు. రాత్రి అయినా కుమారుడు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి పొలంలోకి వెళ్లి చూడగా.. విద్యుదాఘాతంతో స్పృహ తప్పి పడిపోయి ఉన్నాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆలయ నిర్వహణకు నిధులు మంజూరు చేయాలి

- వెలగచర్ల గ్రామస్థుల వినతి


వెలగచర్ల గ్రామస్థులు నిర్మించుకున్న రామాలయం

పెనగలూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): పెనగలూరు మండలం వెలగచర్ల గ్రామంలో గ్రామస్థులు నూతనంగా శ్రీరామ ఆలయాన్ని నిర్మించుకున్నారు. అందరూ చందాలు పోగ చేసి లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఆలయాన్ని నిర్మించారు. అయితే ధూప దీప నైవేద్యం ఆలనాపాలన చూసుకోవడానికి తమకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ ఆలయాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని దేవదాయశాఖకు అప్పగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆలయంలో ధూపదీప నైవేద్యపు ఆలనాపాలన ఖర్చులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈమేరకు దేవదాయ ధర్మాదాయ శాఖకు గ్రామస్థులు విన్నవించారు.

ధూప దీప నైవేద్య ఖర్చులు ఇవ్వండి



గ్రామంలో సుమారు 100 కుటుంబాలు పైబడి ఉన్నాయి. అందరం చందాలు పోగు చేసి ఇటీవల నూతనంగా రామాలయం నిర్మించుకున్నాం. ఈ ఆలయాన్ని దేవదాయశాఖలో విలీనం చేసుకుని ధూప దీప నైవేద్య ఖర్చులు ఇవ్వాలి.

-అబ్బిగారి వెంగయ్య, వెలగచర్ల గ్రామం,

దేవదాయశాఖలో విలీనం చేసుకోవాలి



దేవదాయ ధర్మాదాయశాఖ తమ ఆలయాన్ని వెంటనే విలీనం చేసుకోవాలి. ప్రభుత్వం తరపున ధూప దీప నైవేద్యానికి అందజేసే నెలసరి పారితోషకం మంజూరు చేయాలి.

-ఏనుగుల శంకరయ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు

ఆటో, టిప్పర్ ఢీ... నలుగురికి గాయాలు

ఎర్రగుంట్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జువారి సిమెంట్ కర్మాగారం సమీపంలో బుధవారం తెల్లవారు జమున జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. వీరపునాయునిపల్లె మండలంలోని కీర్తిపల్లెకు చెందిన వారు ప్రొద్దుటూరుకు కూరగాయలు తెచ్చేందుకు ఆటోలో వెళుతున్నారు. జువారి సిమెంట్ కర్మాగారం సమీపంలో వేగంగా వచ్చిన టిప్పర్ ఢీ కొంది. దీంతో ఆటోలో ఉన్న వెంకటరామిరెడ్డి, అంకిరెడ్డి తదితరులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని 108లో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. ఎర్రగుంట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులతో కిటకిటలాడిన బ్రహ్మంగారిమఠం


దీక్షా అలంకరణ గుడి ఉత్సవంలో బ్రహ్మంగారు


బ్రహ్మంగారి దర్శనం కోసం క్యూలైనులో వేచి ఉన్న భక్తులు

బ్రహ్మంగారిమఠం, మే 7 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాల సందర్భంగా నాలుగోరోజు స్వామి సజీవసమాధి వహించిన పవిత్ర దినం కావడంతో పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుండే భక్తులు క్యూలైనులో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 5 గంటలకు వీరబ్రహ్మ సుప్రభాతం, నామసంకీర్తనం, 8గంటలకు అభిషేకం, సహస్రనామార్చన, మధ్యాహ్నం 12 గంటలకు దీక్ష బంధనాలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదార్లు ఇరగంరెడ్డి నాగిరెడ్డి, వెంకటరమణ, ప్రొద్దుటూరు వాస్తవ్యులు గుడి ఉత్సవం చేపట్టారు. మధ్యాహ్నం ఆలయ ప్రాం గణంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు, తాగునీరు, భోజనవసతి ఆలయ ఫిట్ పర్సన్ శంకరబాలాజీ ఆద్వర్యంలో ఏర్పాటు చేశారు. సాయంత్రం 6గం టలకు కంది మల్లయపుర సంస్థాన ఆస్థాన విద్వాంసులు పెద్దపాటి నాగేశ్వర్‌రావు ఉప న్యాసం చేశారు. రాత్రి 8గంటలకు సప్తభారతి భగవతారిణిచే హరి కథా కాలక్షేపం చేశారు. ఆస్థాన పండితులు ఇడమకంటి జనార్ధనచార్యు లు, పోలూరి బాలబ్రహ్మం ఆచార్యులు ఆలయ ప్రాంగణంలో భక్తులకు బ్రహ్మంగారి కాలజ్ఞానం, జీవిత చరిత్ర గురించి ఉపన్యాసం ఇచ్చారు. రాత్రి 11గంటలకు నరనంది ఉత్సవంపై వీరబ్రహ్మేంద్ర స్వామి సమేత గోవిందమాంబ భక్తులకు దర్శనమిచ్చారు. వల్లూరు మండలం పెద్దపుత్త గ్రామానికి చెందిన తాడిగొట్ల వీరారెడ్డి, నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా చేరారు. కాగా, ఆరాధన గురుపూజ మహోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం 4 గంటల నుంచి వీరబ్ర హ్మేంద్రస్వామి దేవస్థానం మాడ వీధుల గుండా బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహిస్తారు.

అర్హుల జాబితా సిద్ధం చేయండి : ఆర్డీవో


జెడ్‌హెచ్‌డీసీ భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్

పోరుమామిళ్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): అసైన్‌మెంటు కమిటీలో భూములను పేదలకు పంచేందుకు అర్హుల జాబితాను సిద్ధం చేయాలని ఆర్డీవో చంద్ర మోహన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని చల్లగిరిగెల పంచాయతీలో జెడ్‌హెచ్‌డీసీ భూములను అర్హులైన పేదలకు పంచేందుకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. అనంతరం ఎల్లోపల్లె సమీపంలో ఉన్న జెడ్‌హెచ్‌సీ భూములను పరిశీలించారు. సర్వే నెంబర్లు 4, 10, 11, 12, 13, 14, 15, 322 నుంచి 343 వరకు గల 351.61 ఎకరాల సంబంధించిన భూముల రికార్డులు పరిశీలించి భూములను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన తహసీల్దారు చంద్రశేఖరరెడ్డి, వీఆర్వోలతో మాట్లాడుతూ భూములకు సంబంధించి సమగ్ర సర్వే నిర్వహించి అర్హుల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండా రామక్రిష్టారెడ్డి, ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమత్ జయంతి ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం

చక్రాయపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 19 నుంచి 22 వరకు జరగనున్న హనుమత్‌జయంతి ఉత్సవాలకు దేవాదాయ ధర్మదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డిని ఆహ్వానించారు. బుధవారం నెల్లూరు లోని మంత్రి స్వగృహంలో గండి ఈఓ వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామిలు ఆహ్వానించారు. అనంతరం హనుమత్ జయంతి కరపత్రాలను మంత్రి చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ గండికి వస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గండి క్షేత్రంలో జరిగే అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు.

తెల్లరేషన్ కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పౌరులకు మెరుగైన సేవలను అందించాలనే లక్ష్యంతో బుధవారం నుంచి జిల్లాలో గ్రామ, వార్డు, సచివాలయాల్లో కొత్త బియ్యం కార్డులు, మార్పులు, చేర్పులకు సంబంధించి ఏడు రకాల సేవలను ప్రారంభించినట్లు జేసీ అదితిసింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త బియ్యం కార్డులు, బియ్యం కార్డులో కొత్త సభ్యుల పేర్లు చేరిక, తొలగించుట, అవసరం లేని కార్డులను సరెండర్ చేయుట, చిరునామాలు మార్చుట, తప్పుడు ఆధార్‌కార్డు సీడింగ్ జరిగి ఉంటే సరిదిద్దుకునేందుకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఈ సేవలు గతంలో ఆమోదించిన ప్రామాణిక ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం అందజేస్తామని తెలిపారు. ఇప్పటికే ఉన్న ధ్రువీకరణలను, ఇతర డేటా బేస్‌లు కలుపుకొని క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారుల సమన్వయంతో అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని తెల్లకార్డు దారులందరూ సద్వినియోగం చేసుకోవాలని జేసీ ఆప్రకటనలో పేర్కొన్నారు.

డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు ఓల్డ్ పింఛన్ స్కీం అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్, మే 7 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు ఓల్డ్ పింఛన్ స్కీం అమలు చేయాలని 2003 డీఎస్సీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో డీఎస్సీ - 2003 ఉపాధ్యాయుల సమావేశం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు ఫోరం జిల్లా అధ్యక్షుడు గుజ్జల తిరుపాల్ అధ్యక్షతన నిర్వహించారు. తిరుపాల్ ఈ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం 2003 ఉద్యోగ ఉపాధ్యాయులకు ఓల్డ్ పింఛన్ స్కీంను అమలు చేయడానికి అన్ని సంఘాలు తమ మద్దతును సంపూర్ణంగా అందజేయా ల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కావేటి ఉదయ భాస్కర్, పీఆర్‌టీయూ, ఎస్టీయూ, యూటీఎఫ్, ఆపస్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు హాజరై తమ సంపూర్ణ మద్దతును తెలిపారు. కార్యక్రమంలో డీఎస్సీ 2003 ఫోరం జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బౌన్ గ్రంథాలయాన్ని సందర్శించిన డాక్టర్ చెల్లప్ప

కడప మారుతీనగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని రిటైర్డ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ చెల్లప్ప బుధవారం సందర్శించారు. పరిశోధన కేంద్రంలోని తాళపత్ర గ్రంథాలను, తామ్రపత్రాన్ని, చేతితో తయారు చేసిన కాగితాలను, బ్రౌన్ రచనలను, మెకంజీ కైఫీయత్తులను చూసి డాక్టర్ చెల్లప్ప హర్షం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో సీపీ బ్రౌన్ భాష పరిశోధన కేంద్రం సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, సహాయ పరిశోధకుడు డాక్టర్ భూతపురి గోపాల క్రిష్ణశాస్త్రి, గ్రంథాలయ సహాయకుడు రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంటు ఆర్.వెంకట రమణ, రిటైర్డ్ తహసీల్దార్లు హుస్సేన్, బాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంపాక్ట్ స్టార్‌స్పీకర్ విజేత నాయబ్‌షైమా

మదనపల్లె టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో తిరుపతి రీజన్ పరిధిలో నిర్వహించిన స్టార్ స్పీకర్ పోటీల్లో మదనపల్లెకు చెందిన నాయబ్‌షైమా విజేతగా నిలిచింది. మదనపల్లెలో జూనియర్ ఇంటర్ విద్యార్థిని నాయబ్‌షైమా ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 4,5 తేదీల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ క్రమంలో నిర్వాహకులు ఆమెకు స్టార్ స్పీకర్ అవార్డు అందజేశారు

'అన్నదాత సుఖీభవ'కు అన్ని వివరాలు ఇవ్వండి

మదనపల్లె టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ పథకం పొందేందుకు రైతులు వారి వివరాలను అందజేయాలని ఏడీఏ శివశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకం ద్వారా రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని మూడు విడతలుగా అందజేస్తాయన్నారు. దీని కోసం రైతులు వారి ఆధార్‌నెంబర్లు, భూమి విస్తీర్ణం వెబ్‌ల్యాండ్‌లోని వివరాలు సరిపోల్చుకోవాలన్నారు. దీంతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రైతులు ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో వారి వివరాలను అందజేయాలని ఏడీఏ కోరారు.

మహనీయులకు ఘన నివాళి



రవీంద్రనాథ్ ఠాగూర్, అల్లూరి సీతారామరాజు చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

వాల్మీకిపురం, మే 7(ఆంధ్రజ్యోతి): విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి, మన్యం వీరుడు అల్లూరిసీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహనీయుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్, ఏపీఎం నరోత్తమ రెడ్డి, సిబ్బంది మహేశ్వరి, సుమతి, శోభ, స్వాతి, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

డీవైఈవోకు సన్మానం



డీవై ఈవోను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మదనపల్లె అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): డీవైఈవోగా బాధ్యతలు స్వీకరించిన వై. లోకవర్ధన్‌రెడ్డిని బుధవారం యూటీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు టి.సుధాకర్, జిల్లా కార్యదర్శులు పురం వెంకటరమణ, ఆదినారాయణ, విజయ్‌కుమార్, నాయకులు అంజాద్, గంగులప్ప, విజయ్‌కుమార్, శ్రీధర్, మురళి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మీడియా ఇన్‌చార్జిగా షేక్ సులేమాన్



మదనపల్లె అర్బన్, మే7 (ఆంధ్రజ్యోతి): భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఏపీ స్టేట్ మీడియా ఇన్‌చార్జిగా షేక్ సులేమాన్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా సయ్యద్ రబ్బానీ బాషా నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. అగ్రవర్ణాల అన్యాయాలను ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పిస్తామన్నారు.

మైనారిటీ కార్పొరేషన్ కింద 24యూనిట్లు మంజూరు

నిమ్మనపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): మైనారిటీ కార్పొరేషన్ కింద మండలానికి 24 యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ లక్ష రూపాయల యూనిట్లు 18, రూ.2 లక్షల యూనిట్లు 4, 3లక్షల యూనిట్లు మూడు ఉన్నాయన్నారు. 22 నుంచి 55 ఏళ్లలోపు వయసున్న ఔత్సాహికులు ఆన్‌లైన్‌లో ఈ నెల 25 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు

ఎస్‌ఐకి సన్మానం




ఎస్‌ఐని సన్మానిస్తున్న నాయకులు

ములకలచెరువు, మే 7(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఐ నరసింహుడును బుధవారం ప్రజాసంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఇటీవల పాత ములకలచెరువు పెద్ద చెరువులో మునిగి నలుగురు మృతి చెందిన విషయం విదితమే. రాత్రి వేళ అయినా ఎస్‌ఐ నరసింహుడు తానే చెరువులోకి దిగి మృతదేహాలను వెలికి తీశారు. దీంతో రెడ్డెప్ప, హరిబాబు, మహేస్, ప్రసాద్, పారేషు, మధు, రామ్మోహన్, రిటైర్డ్ టీచర్ ఆదినారాయణ, టీడీపీనాయకుడు సుబ్బినాయుడు సన్మానించారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి

కురబలకోట, మే 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మండలంలోని కనసానివారిపల్లె కాలనీకి చెందిన ఉదయకుమార్(24) తన స్నేహితులు వెంకటేశ్‌బాబు, బాబా ఫక్రుద్దీన్‌తో కలిసి బుధవారం సీటీఎం నుంచి ద్విచక్రవాహనంలో వస్తుండగా మంత్రాలయం సమీపంలో ట్రాక్టర్ ఢీకొంది. దీంతో ఉదయకుమార్ అక్కడిక్కడే మృతి చెందగా, మిగిలిన ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ జయంతి



పీలేరులో ప్రత్యేక అలంకారంలో వాసవీమాత

మదనపల్లె అర్బన్, మే7(ఆంధ్రజ్యోతి): వాసవీ జయంతి సందర్భంగా మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు స్థానిక దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయం నుంచి గంగను తెచ్చి అభిషేకించారు. అనంతరం కన్యకా పరమేశ్వరిని ప్రత్యేకంగా అలంకరించారు. పంచామృతాభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయం లో హోమాలు నిర్వహించారు. యువత స్థానిక ఆర్యవైశ్య హాస్టల్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనపర్చిన ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. సాయంత్రం అమ్మవారిని పుష్పపల్లకిపై ఊరేగించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు ఓంప్రకాష్, ఉపాధ్యక్షుడు దేవతా సతీష్, కార్యదర్శి సూరే గిరిధర్ తదితరులు పర్యవేక్షించారు. కార్యక్రమం లో ఆర్యవైశ్య మహిళా సంఘాల సభ్యులు యువజనులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలోని ఆలయంలో వేడుకలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి వాసవీ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు

రామసముద్రం: మండల కేంద్రంలోని ఆలయంలో అమ్మవారిని పట్టు వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. గబ్బురి మధుసూదన్ శెట్టి దంపతులు మహాప్రాకార ప్రదక్షిణం, చండీహోమం నిర్వహించారు. మహిళలు దీపాలు మోసి మొక్కులు చెల్లించుకున్నారు. లక్ష్మీకాంతరాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి పూలంగి సేవ నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు నరసింహులుశెట్టి, యువజన సంఘం అధ్యక్షుడు జైకుమార్, మహిళా సంఘం అధ్యక్షురాలు సుబ్బమ్మ, శ్రీనివాసులు, గబ్బురి సుదర్శన్‌బాబు, బద్రినాథ్‌శెట్టి, నాగభూషణ్ శెట్టి, లక్ష్మీకాంతరాజు, ఆర్యవైశ్య సంఘం సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఎంపీడీవో భానుప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

పీలేరు: స్థానిక నెహ్రూబజారులో ఉన్న అమ్మవారి ఆలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేక అలంకరణ, పూజలు, పాలాభిషేకం, హోమం, సాయంత్రం అమ్మవారికి పుష్పపల్లకి సేవ నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ సభ్యులు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనం చేసుకున్నారు. పూజల్లో పాల్గొన్నారు.



మదనపల్లె: గంగాజలం తెస్తున్న ఆర్యవైశ్య మహిళలు



బి.కొత్తకోట: ఊరేగింపులో కోలాటం ఆడుతున్న మహిళలు

పీలేరులో 42 మిల్లీమీటర్ల వర్షం



ఎస్వీ మహల్ థియేటర్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

పీలేరు, మే 7(ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా విపరీతమైన ఉక్కపోత, వడగాల్పులతో విసిగిపోయిన పీలేరు వాసులకు బుధవారం సాయంత్రం స్వాంతన లభించింది. పీలేరులో బుధవారం మధ్యాహ్నం ఈదురుగాలులు, చిరుజల్లులతో ప్రారంభమై భారీ వర్షంలా మారి 42 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సామాన్య ప్రజలకు వేసవి తాపం నుంచి కాసింత ఉపశమనం లభించగా మామిడి రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. బలమైన గాలులు లేకుండా మంచి వర్షం కురిసిందని, దీంతో కాయల సైజు, నాణ్యత పెరుగుతుందని ఉద్యానశాఖాధికారులు తెలిపారు. అయితే రోడ్లపై ప్రవహించిన వర్షం, మురుగునీటితో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.

కార్యకర్తలకు బీజేపీ అండగా నిలుస్తుంది



రామానాయక్‌తండాలో మాట్లాడుతున్న జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్

పెద్దమండ్యం, మే 7(ఆంధ్రజ్యోతి) బీజేపీ కార్యకర్తలకు అండగా ఉంటుందని అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ తెలిపారు. బుధవారం రామానాయక్ తాండాలో కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్నదని తెలిపారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. గ్రామస్థాయి సమస్యలను గుర్తించి తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యకర్తలు ప్రజల విశ్వాసంతో పార్టీ ఆశయాలనుకొనసాగించాలన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేర్చాలన్నారు. అవినీతి, అక్రమాలు నివారించాలన్నారు. అధికారులు మౌలిక సమస్యలు పరిష్కరించాలన్నారు. అభివృద్ధి కోసం సమష్టిగా కృషి చేయాలన్నారు. అధికారులు బాధ్యతగా పని చేయాలన్నారు. రామానాయక్ తాండలో తాగునీటి పైపులైన్ పనులు చేయాలని గ్రామస్తులు కోరారు. మండల బీజేపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి

నిమ్మనపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలో గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో హౌసింగ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకునేందుకు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ప్రభుత్వం అదనంగా రూ.50 వేల నుంచి 70 వేల వరకు మంజూరు చేసిందన్నారు. మండలంలో దాదాపు 150 మంది లబ్ధిదారుల ఖాతాలకు ఈ మొత్తం జమచేసినట్లు తెలిపారు. అయినా ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించలేదన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, హౌసింగ్ సిబ్బంది వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ అమరనాథ్, సిబ్బంది, రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



గుర్రంకొండ: ప్రకృతి వ్యవసాయంపై మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటేశులు



వాల్మీకిపురం: సమావేశంలో మాట్లాడుతున్న ఏవో హేమలత



తంబళ్లపల్లి: రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గుర్రంకొండ, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులను సాధించవచ్చునని ఎంపీడీవో వెంకటేశులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయశాఖ- డీఆర్ డీఏ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటేశులు మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులు సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేసేలా సిబ్బంది పని చేయాలన్నారు. రైతులు పండించే పంటలో ఎక్కువ భాగంగా సేంద్రియ ఎరువులను వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏవో రత్నమ్మ, ఏపీఎం రజనీకుమారి, ఈవోఆర్డీ బ్రహ్మానందరెడ్డి, ఎంటీ వెంకటజ్యోతి, లోకేష్, రైతులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం: స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారిణి హేమలత మాట్లాడుతూ ప్రతి రైతు 30 రకాల విత్తనాలు తెచ్చుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో సార్వత్రిక సూత్రాలు, మహిళ సంఘాలు ఆచరించవలసిన సప్త సూత్రాలు, ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం లో బాగా పంటలు పండించిన రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ మార్కెటింగ్ జిల్లా ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ పవన్, మాస్టర్ ట్రైనర్ సుబ్బరామయ్య, ఏపీఎం నరోత్తమరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: స్థానిక వెలుగు కార్యాలయంలో వ్యవసాయ, వెలుగు, డీఆర్‌డీఏ శాఖలతో ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో లాభాలు, ఆవశ్యకతను మహిళా సంఘాల సభ్యులు, రైతులకు ఆర్‌ఎస్‌కే సిబ్బంది వివరించారు. ఏపీఎం గంగాధర్ మాట్లాడుతూ..ప్రకృతి వ్యవసాయంతోనే రైతులు అధిక లాభాలు పొందవచ్చన్నారు. ప్రతి వీవో స్థాయిలో ఉన్న రైతులు ఖరీఫ్ ప్రణాళిక అమలు చేసేలా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో రమణకుమార్ మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మీ, డీఎంఎంటి సుబ్బరామ్, యూనిట్ ఇంచార్జి రాజు, డ్వాక్రా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

విపత్కర పరిస్థితుల్లో రక్షణ కోసమే మాక్ డ్రిల్

● ఆర్డీవో శ్రీనివాసులు, సీఐ కొండారెడ్డి



తూముకుంట సోలార్‌లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

గాలివీడు, మే 7 (ఆంధ్రజ్యోతి): విపత్కర పరిస్థితుల్లో తమతో పాటు తోటి వారిని రక్షించడం కోసమే మాక్ డ్రిల్ నిర్వహించినట్లు రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు, లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి పేర్కొన్నారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని తూముకుంట గ్రామం సోలార్ పవర్ ప్లాంట్‌లో అగ్నిమాపక సిబ్బందితో కలిసి మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల భద్రత, అప్రమత్తత కోసమే ఈ మాక్ డ్రిల్ నిర్వహణ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అంతేగాక తమ చుట్టూ అనుమానాస్పదంగా ఎవరైనా కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గాలివీడు తహసీల్దార్ భాగ్యలత, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి, రవీంద్ర, ఆర్ఐ బాలాజీ, పోలీసు సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల సమస్యలు పరిష్కరించండి



సీఎం చంద్రబాబును కలసిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సేతు

మదనపల్లె టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేటు విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విజయభారతి హైస్కూల్ కరెస్పాండెంట్ ఎన్.సేతు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. బుధవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతోపాటు రాష్ట్ర సచివాలయానికి వెళ్లిన సేతు సీఎం దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లారు. మదనపల్లె నియోజకవర్గం అభివృద్ధికి అవసరమైన నిధులు, ఇతర సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే సీఎంకు వివరించారు.

విద్య, విజ్ఞాన శిక్షణను సద్వినియోగం చేసుకోండి

మదనపల్లె టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మదనపల్లెలో నిర్వహించే విద్య వైజ్ఞానిక శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థులను చైతన్య పరిచేందుకు నిర్వహించనున్న ఈ శిక్షణ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి 300 మంది ప్రతినిదులు హాజరవుతారన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులను మదనపల్లెలో నిర్వహించడానికి అనుమతి ఇవ్వడంతో ధన్యవాదాలు తెలిపారు. మే 17 నుంచి 26వ తేదీ వరకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, పూర్తి వివరాలకు 90106 27332 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మదనమోహన్, జయబాబు, ప్రేమ్ పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



అన్నదానం నిర్వహిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

మదనపల్లె అర్బన్, మే7(ఆంధ్రజ్యోతి):స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం ఆరాధనోత్సవాలు నిర్వహించారు. ఉదయం అర్చనలు, అభిషేకాలు చేశారు. ఏపీ స్వర్ణకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అప్పినిపల్లె భాస్కరాచారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మి నారాయణాచారి, కార్యదర్శి సుమంత్ కళ్యాణ్, కోశాధికారి కుమారాచారి, ఆలయకమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమా లను ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నేడు సత్యనారాయణ స్వామి కల్యాణం

మదనపల్లె అర్బన్, మే7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పిలి గ్రామంలోని గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు సత్యనారాయణస్వామి వార్షిక కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె. అమనాథ్, వి.రామకృష్ణ తెలిపారు. బుధవారం సాయంత్రం మహాగణపతి పూజ, కలశస్థాపన, ధ్వజావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ వివాహాది శుభకార్యాల నిమిత్యం ఫంక్షన్ హాలు తోపాటు 8 గదులను నిర్మించామని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.అమరనాథ్, సెక్రటరీ వి. రామకృష్ణ, కోశాధికారి దివాకర్, అఖిల బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు అక్షంతల కుమార్, కో ఆర్డినేటర్ శశంకర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేవరకు పోరాటం



సమావేశంలో వాల్మీకి మహాసేన నాయకులు

మదనపల్లె అర్బన్, మే7(ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేంత వరకు పోరాడుతామని వాల్మీకి మహాసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సుదర్శన్, అధ్యక్షుడు చంద్రయ్య, అధికార ప్రతినిధి బొగ్గిటి కృష్ణమూర్తి, ముత్తిరాశి హరికృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాల్మీకి మహాసేన అన్నమయ్య జిల్లా అధ్యక్షుడుగా సుధాకర్, ఉపాధ్యక్షుడుగా విజయకుమార్‌ను ఎంపిక చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న ప్రతిపాదన అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాల్మీ కులను రాజకీయ నేతలు ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారే తప్ప న్యాయం చేయలేదని వాపోయారు. కార్యక్రమంలో నేతలు సుదర్శన్ బాబు, చిప్పిలి చెంద్రాయులు, రవి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసలు



ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఇన్‌చార్జి డీఎంఅమరనాథ్

మదనపల్లె అర్బన్, మే7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ వన్ డిపో పరిధిలోని ఉద్యోగులతో గేట్ మీటింగ్ నిర్వహించినట్లు ఇన్‌చార్జి మేనేజరు అమరనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలు, నగదు ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఇందులో ఈపీకే 43.59, ఓఆర్ 79.56 శాతం సాధించి రీజియన్‌లో వన్ డిపో మొదటి స్థానంలో, కేఎం పీఎల్ 5.46 సాధించడంతో రీజియన్‌లో రెండో స్థానం దక్కిందన్నారు. గ్యారేజ్, ట్రాఫిక్ సిబ్బందిని అభినందించారు. ఆదే ఒరవడిలో పనిచేసి ఆర్టీసీకి ఆదాయం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఎంఎఫ్ రవి, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి

తంబళ్లపల్లె, మే 7(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచేందుకు కృషిచేయాలని ఉ పాధి ఏపీడీ నందకుమార్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో .ఎంపీడీవో ఉపేంద్రరెడ్డితో కలసి ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య తక్కువగా ఉందని, జాబ్ కార్డు ఉన్న వారందరూ పనులకు వచ్చే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. పండ్లతోటలు సాగు చేసుకునే రైతులను ప్రోత్సహించి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. మండలంలోని బాలిరెడ్డిగారిపల్లెలో ఎక్కువ మంది కూలీలు పనులకు వచ్చే విధంగా కృషి చేసిన క్షేత్ర సహాయకుడు శ్రీకాంత్‌ను అభినందించారు. ప్రతి గ్రామంలో కూలీలు పనులకు వచ్చే విధంగా ఫీల్డ్ అసిస్టెం ట్లు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీవో అంజినప్ప, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహిళా గ్రూపు సభ్యులకు అందని స్త్రీనిధి, ఉన్నతి రుణాలు

నిమ్మనపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల మహిళలకు స్త్రీ నిధి, ఉన్నతి రుణాలు అందే పరిస్థితి కనిపించడం లేదని ఏపీఎం మురళి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ స్థానిక మండలం సమాఖ్య కార్యాలయంలో దాదాపు 24 మహిళా సంఘాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే అగ్రహారం పంచాయతీ నవోదయ వీవో కింద దాదాపు 20 మహిళా సంఘాలు ఉండగా గతంలో సంఘమిత్రగా పని చేసిన శారద సుమారు రూ.6లక్షలను దుర్వినియోగం చేసిందన్నారు. మిగిలిన 23 వీవోల్లో ఉన్న సభ్యులు రుణాలను సకాలంలో చెల్లించినా వారికి కూడా స్త్రీనిధి, ఉన్నతి రుణాలు మంజూరయ్యే అవకాశంలేదని తెలిపారు. నిమ్మనపల్లి మహిళా సమాఖ్య బ్లాక్ లిస్టులోకి వెళ్లిపోయినట్లు తెలిపారు.

తాగునీటి సమస్యపై తక్షణం స్పందించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో హరినారాయణ

ములకలచెరువు, మే 7(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యలపై తక్షణం స్పందించాలని ఎంపీడీవో హరినారాయణ ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడితే వెంటనే సమస్యల పరిష్కారానికి చర్య లు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ లే అవుట్‌లలో పక్కా గృహాల నిర్మాణాలను త్వరితగతిన చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సీసీ రోడ్ల నిర్మాణం తదితర సమస్య లపై చర్చించారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

తంబళ్లపల్లె, మే 7(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలంలో వేసవిలో తాగు నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని ఆర్‌ఎన్‌తాండా, ఎద్దులవారికోట, పంచాల మర్రి, బాలిరెడ్డిగారిపల్లె, కోసువారిపల్లె గ్రామాల్లో పర్యటించారు. పైపులైన్ల పనులను పరిశీలించారు. పనులను సకాలంలో, నాణ్యతతో చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. నీటి సౌకర్యం లేని చోట స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకుల సహకారంతో ప్రైవేటు బోర్ల నుంచి లేదా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట జనసేన నాయకులు ఎద్దుల నరసింహులు, బోర్ మెకానిక్ మాధవరెడ్డి, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

నిమ్మనపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పది పంచాయతీల్లో సీసీ రోడ్లు నిర్మించేందుకు రూ.2.5 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు పీఆర్ డీఈఈ శివప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద 45 పనులకు గానూ 6,577 మీటర్ల సీసీ రోడ్లు నిర్మించేందుకు రూ.2.5కోట్లతో ఉన్నతాధికా రులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈ రోడ్లు మంజూరు అయిన వెంటనే ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేయనున్నట్లు తెలిపారు.